# అగ్ని



సామవేదం షణ్ముఖశర్మ

# అగ్ని

రచన:

సామవేదం షణ్ముఖశర్మ

ఋషిపీఠం

ప్రచురణ

# అగ్ని

రచన :
సామవేదం షణ్ముఖశర్మ

ప్రథమ ముద్రణ : డిశంబరు, 1994

ప్రతులు : 1500

(C) సామవేదం షణ్ముఖశర్మ

ముఖచిత్రం : రాము

వెల : రు. 15.00

ప్రతులకు :
ఋషిపీఠం
S-2. గణేశ్ అపార్టుమెంట్సు,
మాచవరం, విజయవాడ-520 004.

ముద్రణ :
శ్రీ అరుణోదయ ప్రింటింగ్ ప్రెస్
సీతారామపురం, విజయవాడ-2. ఫోన్ : 431422

"సర్వదేవతలూ అగ్నిస్వరూపులే. విశ్వమంతా అగ్నిమయమే.

అగ్నికి మరో పేరు 'భరతుడు' అని వేదాలు చెప్తున్నాయి. అనాదిగా మన దేశం యజ్ఞాలతో పునీతమై, 'యజ్ఞ భూమి'గా 'కర్మభూమి'గా ప్రశస్తి పొందింది. ఆ విధంగా అగ్ని ఆరాధన మన సనాతన సంస్కృతి.

ఈ కారణం చేతనే మన దేశాన్ని 'భరతవర్షం' (భారతదేశం) అన్నారు. క్రమంగాఅగ్నిఆరాధన ప్రపంచమంతా వ్యాపించింది.

'అగ్ని' ఐశ్వర్య కారకుడు. కనుకనే ఇంట్లో దీపారాధన లక్ష్మీప్రదమని మన పెద్దలు చెప్పారు..."

# కృతజ్ఞతలు



శ్రీ బెజవాడ రామశేషయ్య దంపతులు

బ్రహ్మశ్రీ సామవేదం రామమూర్తి శర్మగారి కుమారులైన శ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు, ఎన్నో శాస్త్ర విషయాలు పరిశీలించి ఈ గ్రంథాన్ని రచించారు. తరతరాలుగా వీరిది పండితవంశం. ఉత్తమ సంస్కారంతో వ్రాయబడ్డ ఈ గ్రంథాన్ని వెలువరించే అవకాశం కలిగినందుకు కృతజ్ఞుడ్ని.

మనందరినీ ఆ అగ్ని భగవానుడు అనుగ్రహించుగాక.

శుభమస్తు!

— బెజవాడ రామశేషయ్య

# అక్షరాశీస్సు

'అగ్ని' అనంగానే సంప్రదాయజ్ఞులికి మొదటగా జ్ఞాపకం వచ్చే వాడు "అంగిరశ్శిలి". ప్రాజాపత్యవహ్ని స్వరూపుడైన ఈ అంగిరశ్శిలి అగ్నిపుత్రుడుగా, ప్రథమాగ్ని స్వరూపుడుగా అంగీకరింపబడ్డాడు. ఈ "అంగిరోఽగ్ని" నుండి - పుమాకారమైన ఏడగ్నులు, కాంతాకారమైన ఏడగ్నులు సముద్భవించాయి.

"తపుడు" అనే ఇంకో అగ్ని ఉన్నాడు. ఆ "తపోఽగ్ని" నుండి మరో పదిహేను రకాల అగ్నులు సముద్భవించాయి.

ద్రష్టయైన అంగిరుడు ఈ సర్వాగ్నుల యందూ పరిశోధనలు జరిపాడు. పరిశీలిస్తే-నేటి అణువిజ్ఞానం వలెనే ఆ అగ్నులన్నీ శతఘ్ని నిర్మాణానికీ, శత్రు సంహారానికీ, మహానగర వినాశనానికీ పనిచేసి యజ్ఞ వినాశకములుగా దారితీశాయని తెలుస్తుంది. యజ్ఞమంటే జగత్కళ్యాణ మని అర్థం.

ఛాందోగ్యోపనిషత్తులోని శ్వేతకేతూపాఖ్యానంలో "పంచాగ్ని విద్య" గురించి చెప్పబడింది. సోమము, మేఘము, అన్నము, వీర్యము, స్త్రీ గర్భము అనే పంచాగ్నుల యందు సంచరించే ప్రాణశక్తిని గురించి చెపుతుందీ విద్య. మొదట ఈ విద్య క్షత్రియులలో ఉండేది. వారి నుండి బ్రాహ్మణులు ఈ విద్యను గ్రహించారు.

మహాభారత కథలోని "ఉదంకుడు" కూడా ఈ అగ్న్యుపాసకుడే! ఆ ఉదంకోపాఖ్యానం - అహోరాత్రములుగా, పక్షములుగా, మాసములుగా, ఋతువులుగా, అయనములుగా, సంవత్సర రూపాత్మకముగా సంచరిస్తున్న ఈ కాలాగ్నిని వర్ణించే కథే!

ఆ అగ్నిని బహిర్ముఖం చేసి, నాగలోకాన్ని వశం చేసుకుని, గురుపత్ని కుండలాలను తిరిగి తక్షకుడి నుంచి సాధించాడు ఉదంకుడు. తరువాత సర్పయాగానికి జనమేజయుడిని పురికొల్పాడు.

అగ్ని వలననే కాంతి పుడుతోంది. ఆ కాంతిలోని అతినీల లోహిత కిరణాలు(ULTRA-VIOLET RAYS), INFRA-RED RAYS కిరణాల వలననే దృశ్యమాన వస్తువు లదృశ్యమగుట, అదృశ్య వస్తువులు దృశ్యమాన మగుట జరుగుతోంది. ఈ దృశ దృశ్యాదృశ్య సర్వాగ్నులనీ దర్శించి ఉపాసించినవాడు రావణ పుత్రుడైన మేఘనాథుడు (ఇంద్రజిత్తు). అందుకే అతను మాయాయుద్ధంలో సిద్ధహస్తుడైనాడు.

ఈ విధంగా అగ్నిని బహిర్ముఖంగా విజృంభింపజేసిన అనేకమంది పురాణ పురుషులు, ఆధునికులు యజ్ఞనాశకులయ్యారు, అవుతున్నారు. ఆ అగ్నిని అంతర్ముఖంగా జ్వలింపజేస్తే బ్రహ్మసాక్షాత్కారమౌతుంది.

అగ్ని వంశంలో పుట్టి అలా భగవత్సాక్షాత్కారం పొందినవాడు అంగిరశ్శిలి శిష్యుడైన "సురహంత" అనే ఋషి. ఇలా చెప్పుకుంటే అగ్నిని గురించి ఎంతైనా ఉంది. "అగ్నిమయం జగత్సర్వం", ఈ జగత్తంతా ఆ బ్రహ్మయొక్క ముద్రయే !

భగవదనుగ్రహం వలనా, తన పితృపాదులైన 'శ్రీ రామమూర్తి శర్మగారి ఆశీర్బలం వలనా, మత్పుత్ర తుల్యుడైన చిరంజీవి సామవేదం షణ్ముఖశర్మ ఈ "అగ్ని" గ్రంథ రచనలో కొంతవరకు, కాదు, చాలా వరకే కృతకృత్యుడయ్యాడు.

ఈ గ్రంథం ఒక "అగ్నిగీత!"—ఒక చిన్న "అగ్నినిఘంటువు".

బ్రహ్మాగ్ని—బ్రహ్మకాహూతం.

—విశ్వనాథ పావనిశాస్త్రి

# విన్నపం

ఈ 'అగ్ని' విషయం నేను ప్రస్తావించేందుకు ప్రేరకులు శ్రీ బెజవాడ రామశేషయ్యగారు.

విజయవాడ రామానగర్‌లోని 'శ్రీ శివరామకృష్ణ క్షేత్రం'లో ఇరవై ఆరేళ్ళుగా పెద్దలచేత, పండితులచేత ఉభయ సంధ్యలలో నిరాటంకంగా అధ్యాత్మిక ప్రవచనాలను ఏర్పాటు చేస్తున్న భగవత్కథా శ్రవణపరులు. భాగవతపరాయణులు. ఈశ్వరభక్తితో, వినయంగా అనేక మంది పెద్దల ఉపన్యాసాలను వింటూ, వాటిని హృదయగతం చేసుకున్న ధన్యజీవి. బ్రహ్మశ్రీ ముదిగొండ పిచ్చయ్య శాస్త్రిగారిని గురువుగా ఆరాధించి, తన బుద్ధిని చైతన్యవంతం చేసుకున్న గురుభక్తిపరులు. అరవై తొమ్మిదేళ్ళ వృద్ధాప్యంలో సైతం అవిశ్రాంతంగా భాగవత కథా యజ్ఞాన్ని కొనసాగిస్తున్న సార్థకజీవనులు. అనేకమంది పెద్దలు ఉపన్యసిస్తుండగా, ప్రసంగ సందర్భంగా వివిధ విషయాలలో వారు చెప్పిన అగ్నుల పేర్లు ఒక జాబితాగా వ్రాసుకున్నారు రామశేషయ్యగారు. కాలాగ్ని, క్రోధాగ్ని, జఠరాగ్ని, దావాగ్ని, బడబాగ్ని, తపోగ్ని, జ్ఞానాగ్ని, యోగాగ్ని, జ్వరాగ్ని .... ఇలా అనేకాగ్నుల పేర్లు ఎంతో భక్తి శ్రద్ధలతో రాసుకున్నారు.

శివరామకృష్ణ క్షేత్రంలో నేను చాలామార్లు వివిధ విషయాలపై ప్రసంగాలు చేయడం తటస్థించింది. ఓ సారి రామశేషయ్యగారు తాను అగ్ని పేర్లను వ్రాసుకున్న కాగితాన్నిచ్చి, అగ్ని విషయంగా ఉపన్యసించమని కోరారు. వారి ఆ ప్రయత్నం, ఆసక్తి నన్ను ఆనంద పరవశుణ్ణి

చేశాయి. వారి జిజ్ఞాస ప్రశంసార్హం. ఆయన కోరిన కోరికే నాకు ప్రేరణ అయింది. అప్పటినుండి 'అగ్ని' విషయమై భావన చేయసాగాను.

ఉమామహేశ్వరుల కృపతో కొన్ని విషయాలు శోధించగలిగే అవకాశం, అదృష్టం లభించాయి. వేదమంత్రాలు, పురాణేతిహాసాలు, వివిధశాస్త్ర విషయాలు పరిశీలిస్తూ, నా బుద్ధిశక్తి ననుసరించి అగ్ని విషయ భావనతో - 'అగ్ని' అనే అంశంపై నాలుగు రోజులు ఉపన్యసించాను.

దానిని విన్న పెద్దలు ఆనందించి, "నా ఉపన్యాసాన్ని పుస్తకంగా తీసుకురావాల"ని కోరారు. అప్పుడు రామశేషయ్యగారు, ఆ ఉపన్యాసాన్ని పుస్తకంగా వ్రాయమని, తానే పూర్తిగా ముద్రణా వ్యయాన్ని భరిస్తానని చెప్పారు. కృతిని వెలుగులోకి తీసుకురావడం ఒక యజ్ఞమే.

ఆ తరువాత - నేను ఉపన్యసించిన విషయాలనే కాక, ఉపన్యాసానంతరం సాగించిన సాధన, భావనలతో — అగ్నిమూర్తి కృపచేత మరికొన్ని అంశాలను కూడా చేర్చి ఈ "అగ్ని" గ్రంథాన్ని రచించాను.

'అగ్ని'పై ఇది సమగ్ర గ్రంథం అని నేను చెప్పడంలేదు. ఇంకా రాయాల్సింది ఎంతో వుందనే అనిపిస్తోంది. అసలు వాఙ్మయమంతా అగ్నిమయమే. విశ్వమంతా అగ్నిమయమే. కనుక చూసేకంటికి అగ్ని అనంతంగానే కనబడతాడు. ఎంత రాసినా ఇంకా మిగిలే వుందనిపించడమే అగ్ని మహత్తు. అపార సముద్రజలం నుండి ఒక ఉద్ధరిణతో జలం తీసినట్టుగా, నా బుద్ధికి అందినంత మాత్రమే అందించాను.

నా బుద్ధినీ, వాక్కునూ సార్థకం చేసుకునేందుకే ఈ కృతి రచన.

నా ఆరాధ్య దైవాలైన ఉమామహేశ్వరులకు దీనిని అంకితంగా సమర్పించుకుంటూ, దీనికి ఫలంగా వారి ఎడల అచంచలభక్తి లభించాలని ప్రార్థిస్తున్నాను. ఇవి ఆ వాగర్థరూపులు పలికించిన పలుకులే.

ఈ గ్రంథానికి ప్రేరకులు మాత్రమే కాకుండా, దీని ముద్రణా వ్యయం భరించి, వెలుగులోకి తెచ్చిన శ్రీ బెజవాడ రామశేషయ్యగారికి

కృతిపోషణ పుణ్యకార్య ఫలంగా అగ్నిభగవానుని దివ్యానుగ్రహం లభించాలని కోరుకుంటున్నాను. ఆయనకు పరిపూర్ణ ఆయురారోగ్యాలు లభించాలని అగ్నిభట్టారకుని ప్రార్థిస్తున్నాను.

నాకు అక్షర సంస్కారాన్నీ, ఆధ్యాత్మిక జిజ్ఞాసనీ కలిగించి, తన దీవెనల బలంతో నన్ను జీవింపజేస్తూన్న నా గురుదేవులు, నా తండ్రిగారు బ్రహ్మశ్రీ సామవేదం రామమూర్తి శర్మగారికి వినయ వినమిత ప్రణామ సహస్రాలు. నా మాతృమూర్తికి నా కై మోడ్పులు.

నా ఆరాధ్య సాహితీవిరాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి పుత్రులైన శ్రీ పావని శాస్త్రిగారు నా యందు వాత్సల్యంతో తమ 'అక్షరాశీస్సు'ను ప్రసాదించినందుకు ధన్యుడిని.

నా ఆధ్యాత్మిక జీవితాన ఉత్సాహాన్ని ఉద్దీపింపజేసే నా ధర్మపత్ని పుష్పలత, ఈ గ్రంథం పూర్తి కావడంలో తగిన ప్రోత్సాహాన్నిచ్చినందుకు కృతజ్ఞతా పాత్రురాలు.

ముఖచిత్రం అందంగా రూపొందించి, ముద్రించిన సహృదయ మిత్రులు శ్రీ 'రాము'గారి స్నేహానికి అభివందనాలు.

ఈ గ్రంథం వెయ్యి ప్రతులుగా కాక, పదిహేను వందల ప్రతులుగా వెలువడేందుకు కారకులు సుహృన్మణి శ్రీ అన్నాజీప్రసాద్ (అన్నాజీ ఎంటర్‌ప్రైజస్, విజయవాడ) గారికి, సదా స్నేహపూర్వక కృతజ్ఞతలు.

ఈ గ్రంథాన్ని సకాలములో చక్కగా ముద్రించి ఇచ్చిన శ్రీ అరుణోదయ ప్రింటింగ్ ప్రెస్ వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ఈ కృతి సాంబశివుని కృప. ఆ స్వామి ప్రసాదించిన అక్షరశక్తి ఆ స్వామికే నైవేద్యం.

—సామవేదం షణ్ముఖశర్మ

# ఋషిపీఠం

భగవత్ప్రీతిగా సమర్పించిన

ద్వితీయ అక్షర కుసుమం

# అగ్ని

అగ్నివర్ణాం అగ్నిరూపాం అగ్నినేత్రాం సరస్వతిమ్।
వాఙ్మయీం వాక్ప్రదాం వందే వాణీం వాగీశ్వరీం సదా॥

పాపదాహకరూపం త్వాం చిత్తపావనకారకం।
జ్ఞానప్రకాశకం వందే అగ్నిరూపం మహేశ్వరమ్॥

*　　*　　*

'సర్వం బ్రహ్మమయం జగత్'—

అన్ని వేదాలకీ, పురాణాలకీ, ఉపనిషత్తులకీ పరమ లక్ష్యమిదే.

బ్రహ్మమే లక్ష్యం. బ్రహ్మమే ఉపాస్యం. బ్రహ్మమే ఇష్టం. బ్రహ్మమే శరణ్యం.

బ్రహ్మం — అంటే :

బృహత్వాత్ బృంహణత్వాత్ — బ్రహ్మ. 'మహోన్నతమై', 'సర్వవ్యాపకమై', సత్యమై, చిన్మయమై, ఆనం

దమై, ఏకమై, అద్వితీయమై, సాక్షియై ... ప్రకాశించే జ్యోతి స్వరూపం బ్రహ్మ.

ఆ బ్రహ్మయే సృష్టి స్థితి సంహార లయానుగ్రహాలనే పంచకృత్యాలతో ఈశ్వరుడయ్యాడు.

ఆ ఈశ్వరుడు అష్టమూర్తి. అంటే ఎనిమిది మూర్తుల వాడు. 1. పృథ్వి, 2. నీరు, 3. అగ్ని, 4. వాయువు, 5. ఆకాశము, 6. సూర్యుడు, 7, చంద్రుడు, 8. యజమాని (యజనము చేయువాడు.)

ఇవి ఈశ్వర స్వరూపాలు. ఇందులో ఏ మూర్తినైనా సరే, ఉపాసిస్తే, ఆ మూర్తిలోని బ్రహ్మత్వం గోచరిస్తుంది. జీవుని పరమ ప్రాప్యమైన కైవల్యం సిద్ధిస్తుంది.

అష్టమూర్తులలో ఒకటైన అగ్నిమూర్తిని గురించి భావిస్తే—మన వేద పురాణాది ఆర్ష వాఙ్మయం, మంత్ర తంత్ర ధర్మశాస్త్రాదులు ప్రవచించినబ్రహ్మత్వమే సాక్షాత్కరిస్తుంది.

అగ్నియే బ్రహ్మం.

ఆ అగ్నే సర్వదేవతల స్వరూపం. ఏ దేవతని తృప్తి పరచాలన్నా అగ్ని ద్వారానే సాధ్యం. 'అగ్ని ముఖా వై దేవాః' అని శ్రుతి.

దేవతలు అగ్నిముఖులు. కనుకనే యజ్ఞ ద్రవ్యాలు అగ్నిలో సమర్పిస్తే, అవి దేవతలకు అందుతున్నాయి.

అగ్నికి నమస్కారం సర్వదేవతా నమస్కారం.

'అగ్ని' ముఖ్య లక్షణాలు— 1. దహించుట, 2.శుద్ధి (పావనం) చేయుట, 3. ప్రకాశింపజేయుట.

ఈ మూడు లక్షణాల వల్లనే మనకు ప్రయోజనం.

1. మన అశుభాలను, కర్మ బంధాలను దహించి, 2. వాసనా క్షయం చేసి, శుద్ధులను చేసి, 3. జ్ఞాన ప్రకాశంతో కైవల్యాన్నివ్వడం—బ్రహ్మ స్వరూపుడైన 'అగ్ని' లక్షణం.

ఈ మూడూ కలిగించే ఎవరైనా, ఏదైనా 'అగ్ని' స్వరూపమే.

'అగ్ని' రెండు విధాలు. 1.ఇంధనాగ్ని, 2.అనింధనాగ్ని.

ఇంధనాన్ని ఆధారం చేసుకొని మండేది. ఏ ఇంధనమూ ఆధారం కాకుండా మండేది. ఈ రెండవది స్పష్టంగా గోచరం కాదు. తపోదృష్టికీ, ఉపాసనా దృష్టికీ గోచరించేది.

ఈశ్వరుని 'బ్రహ్మజ్యోతి స్వరూపం చ' అన్నారు. మహోన్నతమై, సర్వవ్యాపకమైన జ్యోతి (అగ్ని) ఈశ్వరుని స్వరూపం. అంటే ఈశ్వరుడు అగ్నిస్వరూపుడన్నది సుస్పష్టం.

ఆ అగ్ని లౌకికాగ్ని కాదు. అది అలౌకికాగ్ని. అనింధనాగ్ని. శాశ్వతాగ్ని.

ఇంధనాదుల నాశ్రయించి మండే అగ్ని మన కంటికి కనబడేది. అగ్ని దేవుడు ఆ ఇంధనాధారంగా ప్రత్యక్షమవుతున్నాడు. ఇంధనం పూర్తయ్యాక తిరోహితుడవుతున్నాడు. ఇక్కడ నాశనమైంది ఇంధనమే. అగ్ని కాదు.

నిరాకార బ్రహ్మము జ్యోతి (అగ్ని) స్వరూపమే. ఇక ఆ బ్రహ్మము సాకారమైతే ఆ సాకార దేవతా రూపాలూ అగ్నిరూపాలే.

దేవతలు తైజసశరీరులని శాస్త్ర ప్రమాణం. వారు అగ్నిశరీరులు

'ఇంధనాగ్ని' ఉపాధి సహితమైనది. దీపకళిక, యజ్ఞాగ్ని, పచనానికి ఉపయోగించే వహ్ని ...ఇలా ఎన్నో!

మన దేహంలో జఠరాగ్ని, కంటిలో ప్రకాశం, శరీరంలో ఉష్ణత్వం...ఇవి అగ్నిరూపాలే. సూర్యుడు, నక్షత్రాలు...ఇవన్నీ జ్యోతి (అగ్ని) స్వరూపాలు. బడబాగ్ని, దావాగ్ని... మొదలైన వనాగ్నులు సరే సరి.

మానసిక భావాలు కూడా అగ్నులే ... కామాగ్ని, క్రోధాగ్ని ఇత్యాదులు. ఆధ్యాత్మిక సాధనలూ అగ్నులే... యోగాగ్ని, జ్ఞానాగ్ని, తపోగ్ని మొదలైనవి.

ఇలా—సర్వం అగ్నిమయం జగత్.

అగ్ని లేనిదే శక్తిలేదు. అగ్ని, శక్తి పరస్పరాధారితాలు.

అగ్ని లేని చోటులేదు. అన్ని అగ్నులూ ఒకేలా కాకున్నా, ఒక్కో అగ్ని ఒక్కో కార్యం చేస్తుంటుంది.

అన్ని కార్యాలనూ నిర్వహించే అనేకాగ్నులు... ఒకే ఒక్క అగ్నియొక్క బహువిధరూపాలు. 'ఏకోహం బహుస్యామ్' అన్న బ్రహ్మ సంకల్పానికి క్రియారూపమే ఇది.

సృష్టిలో ఏదైనా మనకి గోచరం కావాలంటే, దానికి రూపం కావాలి. రూపమిచ్చేది అగ్ని. రూపరహితుడూ అగ్నే. నిరాకార జ్యోతిర్మయ బ్రహ్మమే అగ్ని. సాకార విశ్వమూ అగ్నే.

శబ్ద స్పర్శ రూప రస గంధాలు... ఇవి పంచమహా భూతాల గుణాలు. ఆకాశగుణం—శబ్దం, వాయుగుణం—స్పర్శ, అగ్నిగుణం—రూపం, నీటిగుణం — రసం, భూమిగుణం—గంధం.

రూప గుణమున్న అగ్నిలో శబ్దమూ వుంది. స్పర్శా వుంది. అంటే ఆకాశవాయు గుణాలు అగ్నిలో వున్నాయి. "అగ్నే రాపః"...ఆ అగ్నే జలానికి కారణం.

"హిరణ్యవర్ణాః శుచయః యా పావకాః
యా సుజాతః కశ్యపో యాస్వింద్రః
అగ్నిం యా గర్భం దధిరే విరూపాః
తాన ఆపశ్శగ్గ్ స్యోనా భవంతు—"

"బంగారు రంగుగల శుభ్రములైన అగ్నులు ఎక్కడ పుట్టాయో, కశ్యపుడను అగ్ని ఎక్కడ పుట్టా, ఏ జలములు మంచి వర్ణాలు కలిగిన అగ్నిని తమగర్భాన ధరించాయో—అట్టి జలాలు మా శాంతికి తోడ్పడు గాక."

—అని జలాలను అగ్నిగర్భాలుగా దర్శించారు.

దాహహరణ శక్తి వున్న అగ్ని రసగుణంతో జలమయ్యాడు. జలంలోని అగ్ని శక్తిగా మారి విద్యుచ్ఛక్తిగా

పని చేస్తుంది. ఈ విషయం మనకి స్పష్టంగా అనుభవైక వేద్యమే. ఈ అగ్ని లక్షణం చేతనే జలం శుద్ధిని చేస్తోంది. జీర్ణక్రియకి దోహదపడుతోంది.

శబ్ద స్పర్శ రూపరసాలతోడి అగ్ని పృథ్విలో వుంది. కనుకనే—ఆ అగ్ని లక్షణమైన ఉష్ణతాది శక్తులచేత, బీజాదులు అంకురించుట, సస్యాదులు ఫలించుట, వృక్షాదులు వృద్ధి చెందుట...ఇత్యాదులు సంభవమౌతున్నాయి. అగ్ని లేనిదే ఉత్పత్తిలేదు. స్వేదజ, అండజ, ఉద్భిజ, జరాయుజాలనే చతుర్వర్గ జీవసమూహ ఉత్పత్తికి కారణం అగ్నే.

ఇలా అన్ని భూతాలూ అగ్నిమయమే.

## 'అగ్ని' అంటే?

మనది యజ్ఞ సంస్కృతి. సృష్ట్యాదిలో— 'సహ యజ్ఞాః ప్రజాన్ సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః' — అనే గీతావచనం ప్రకారం, పరస్పర భావితులైన ప్రజలకూ, దేవతలకూ—ఆ భావనా మాధ్యమం 'యజ్ఞమే'. సర్వ దేవతలూ యజ్ఞభావితులు. యజ్ఞం ద్వారా ప్రజలను అనుగ్రహిస్తారు దేవతలు.

కనుక ప్రజాపతి సృష్టికి 'అగ్ర'మున సృష్టించింది యజ్ఞాన్నే. ఆ యజ్ఞం బ్రహ్మమయం. 'అగ్ర'మునందు సృష్టించబడిన ఆ యజ్ఞమూర్తే 'అగ్రి'. 'పరోక్షప్రియ ఇవ దేవాః' (దేవతలు పరోక్ష ప్రియులు)— అనే వేదవచనానుసారం 'అగ్రి', 'అగ్ని' అయ్యింది.

నిరంతరం ఈ విశ్వంలో యజ్ఞం జరుగుతూనే వుంది. 'బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్' అనే గీతా వాక్య ప్రమాణంగా యజ్ఞమే బ్రహ్మం.

సృష్టి అంతటికీ అగ్రమునందు (ఆదిలో) వున్నది నిరాకార నిరామయ సచ్చిదానందమయ శాశ్వత బ్రహ్మమే. కనుక 'అగ్రము' నందున్న ఆ బ్రహ్మమే 'అగ్రి' (అగ్ని).

స యదస్య సర్వస్యాగ్ర మసృజ్యత
తస్మా దగ్నిర్హవై తమగ్ని రిత్యాచక్షతే పరోక్ష.

'అగ్నీ ప్రథమః'—అని శ్రుత్యుక్తి. సృష్ట్యాదివాడు.

'అగ్రే నియతి ఇతి అగ్నిః' — అని వ్యుత్పత్తి. ముందుండి నడుపువాడు—అగ్ని.

సమస్త దేవతలూ అగ్ని స్వరూపులే. దేవతల ఆవిర్భావం అగ్నివల్లనే. అసలు 'దేవ' శబ్దమే అగ్నిని తెలియజేస్తోంది. 'దీవ్యత ఇతి దేవః' — ప్రకాశ స్వరూపులు దేవతలు. ప్రకాశం అగ్నిలక్షణం. కనుక దేవతలు అగ్ని స్వరూపులే. కనుకనే ఆ తైజస శరీరులు కాంతులు వెదజల్లే రూపాలతో ప్రకాశిస్తుంటారు. 'కోటిసూర్యప్రతీకాశం', 'అగ్నివర్ణం'—ఇలా దేవతల రూపాన్ని వర్ణించే సందర్భాలు ఎన్నో.

అగ్నిర్వై దేవయోనిః
సోగ్నేర్దేవ యోన్యా ఆహుతిభ్యస్సంభవంతి
(ఐతరేయ బ్రాహ్మణం)

దేవతలకు కారణమైన వాడు అగ్ని. ఆ దేవయోని అయిన అగ్నివల్లనే ఆహుతులు సంభవిస్తున్నాయి.

వృక్షానికి జలాలు అందివ్వాలంటే మూలానికి నీరు పోస్తాం. అలాగే దేవతలను తృప్తి పరచాలంటే అగ్నిని ఆరాధించాలి. అగ్నికే సమర్పించాలి. 'వృక్షమూల సేచన న్యాయాత్'. ఈ విషయం శివపురాణంలో చెప్పబడింది.

తమేవ భాంతి మనుభాతి సర్వం -
తస్య భాసా సర్వమిదం విభాతి...

ఆ పరబ్రహ్మ (అగ్ని) ప్రకాశించడం వల్లనే సర్వం అతడిని అనుసరించి ప్రకాశిస్తోంది. అతడి కాంతి ఈ సర్వమూ వ్యాపించి ప్రకాశిస్తోంది.

అగ్నిర్జాగార తమృచః కామయంతే

ఆ అగ్ని – సాక్షియై, వినిద్రుడై, నిరంతర జాగరూకుడై వున్నాడు.

సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ. ఆ సాక్షి రూపుడే కేవలుడు. నిర్గుణుడు.

## అగ్ని దేవుడు

'బ్రహ్మం' రెండు విధాలు. ఒకటి—నిర్గుణ బ్రహ్మం, రెండు—సగుణబ్రహ్మం. రెండింటికీ అభేదాన్ని శ్రుతి స్మృతి పురాణాలు ప్రతిపాదిస్తున్నాయి.

శివ, విష్ణు, బ్రహ్మ, గణపతి, సూర్య, శక్తి— మొదలైన నామాలన్నీ నిర్గుణ బ్రహ్మవాచకాలైనా, ఆ బ్రహ్మము సగుణమైనప్పుడు నామరూపాలు ఏర్పడ్డాయి. ఒక్కో నామానికీ ఒక్కోరూపం ఏర్పడింది.

'శివ' నామ వాచ్యరూపుడు — శూలధారి, ధవళ వర్ణుడు, త్రినేత్రుడు, నీలకంఠుడు. 'విష్ణు' శబ్ద వాచ్యుడు- చతుర్భుజుడు, నీలవర్ణుడు, శంఖ చక్ర గదా ధారుడు.

ఈ సగుణ బ్రహ్మ రూపాలన్నీ బ్రహ్మ లక్షణాన్ని తెలియజేసేవే. బ్రహ్మమునకు సంబంధించిన నామములు— శివ, విష్ణువు మొదలైనవి – సగుణ బ్రహ్మయొక్క సాకార రూపాలకు ఆ విధంగా అన్వయించబడ్డాయి. అదే విధంగా 'అగ్ని' వాచ్యుడైన బ్రహ్మము యొక్క సగుణ రూపం వేద పురాణాలు వివరించాయి.

శోధకత్వ (శుద్ధి చేయుట—పావనం చేయుట), దాహకత్వ (దహింపజేయుట), ప్రకాశకత్వ (ప్రకాశించుట)— అనే మూడు గుణాలు గల బ్రహ్మము, 'అగ్ని' రూపంగా సగుణ సాకారమైనప్పుడు ఆ మూర్తిని ఇలా వర్ణించారు-

సప్తహస్తః చతుశ్శృఙ్గః సప్తజిహ్వో ద్విశీర్షకః।
త్రిపాత్ ప్రసన్నవదనః సుఖాసీనః శుచిస్మితః॥
స్వాహాంస్తు దక్షిణే పార్శ్వే దేవీం వామే స్వధాం తథా।
బిభ్రద్దక్షిణ హస్తైస్తు శక్తి మన్నం స్రుచం స్రువమ్॥

(2)

తోమరం వ్యజనం వామైర్ఘృతపాత్రం తు ధారయన్।
మేషారూఢం జటాబద్ధం గౌరవర్ణం మహౌజసమ్॥
ధూమధ్వజం లోహితాక్షం సప్తార్చిః సర్వకామదమ్।
ఆత్మాభిముఖ మాసీనమేవం ధ్యాయేద్ధుతాశనమ్॥

అగ్ని దేవునకు ఏడు చేతులు, నాలుగు కొమ్ములు, ఏడు నాల్కలు. రెండు ముఖాలు, మూడు పాదాలు.

అగ్ని ప్రసన్నవదనుడు. మేష వాహనుడు. అగ్ని దేవుని కుడివైపు స్వాహాదేవి, ఎడమవైపు స్వధాదేవి కూర్చొని వున్నారు.

కుడివైపు నాలుగు చేతుల్లో—శక్తి, అన్నం, సృక్, సృవం. ఎడమవైపు మూడు చేతుల్లో— తోమరం, వ్యజనం, ఘృతపాత్ర ధరించి వున్నాడు.

జటాధారి, ధవళవర్ణుడు, ఎర్రని కన్నులున్న అగ్ని దేవుడు సర్వాభీష్టాలను నెరవేర్చే దైవం. ఆయన ధూమ ధ్వజుడు (పొగజెండా గలవాడు).

-ఇదీ యజ్ఞ దేవుడైన అగ్నిరూపం.

'స్వాహా' అనే వేద మంత్రాలతో దేవతల నుద్దేశించి అగ్నికి ఆహుతులిస్తారు. పితృ దేవతల నుద్దేశించి 'స్వధా' కారంతో ఆహుతులిస్తారు. స్వాహా స్వధాకారాలే యజ్ఞ మూర్తి యొక్క శక్తులు. ఆ తత్వాన్ని తెలియజేసేదే - స్వాహా, స్వధా దేవీలతో కూడిన అగ్నిరూపం.

శక్తి, తోమరం, వ్యజనం - అగ్నియొక్క పరాక్రమాన్ని తెలియజేసే ఆయుధాలు. 'వ్యజనం' (విసనకర్ర) అగ్నిని ప్రజ్వలింపజేసే వాయువుకి ప్రతీక.

అన్నం, ఘృతపాత్ర - యజ్ఞ ద్రవ్యాలు. స్రుక్, స్రువాలు యజ్ఞపరికరాలు. ఇవే అగ్నిస్వామి ఆయుధాలు. యజ్ఞతత్త్వాన్ని తెలియజేసేవి. జటాధారణ, ధవళవర్ణం- జ్ఞానపూర్ణమైన శుద్ధత్వాన్ని తెలియజేసేవి. అగ్ని పరాక్రమవంతుడు. కనుకనే 'మహౌజసుడు' అన్నారు.

హుతాశనుని దివ్యరూప తత్త్వమిది. సాకార బ్రహ్మరూపాలలో యజ్ఞతత్త్వాన్ని తెలియజేసే అగ్నిరూపమిది.

అగ్నిహోత్రారాధనలో, వైశ్వదేవార్చనలో 'అగ్ని'ని ఈ రూపంగా ధ్యానించి ఆరాధిస్తారు.

అగ్ని కాంతి స్వరూపుడు. కాంతి సప్తవర్ణవిలసితం. కనుకనే సప్తజిహ్వలు, సప్త హస్తాలు అని వర్ణించబడింది.

సప్తజిహ్వల పేర్లు :

ఈశాన్య దిక్కున 'హిరణ్య' నామంతో వున్న జిహ్వ, తూర్పున 'కనక', ఆగ్నేయాన 'రక్త', నైఋతి దిక్కున 'కృష్ణ', పశ్చిమాన 'సుప్రభ', వాయవ్యాన 'అతిరిక్త', మధ్యన 'బహురూప' - అనే ఏడు జిహ్వలు.

అగ్ని సప్తజ్వాలా విలసితుడు. ఆ జ్వాలల్నే సప్త హస్తాలు అనవచ్చు. అవి : 1. కాళీ, 2. కరాళీ, 3. రక్తాక్షీ, 4. పింగళీ, 5. హేమాంగీ, 6. నీలా, 7. శుక్లవర్ణ.

వీటిబట్టి వర్ణస్వరూపుడు, కాంతి స్వరూపుడు అగ్ని భగవానుడు అన్నది స్పష్టం.

## స్వా హా దే వి

స్వాహాదేవి ఎవరో, స్వధాదేవి ఆమే.

దేవతల నుద్దేశించి ఆహుతి నిచ్చినప్పుడు 'స్వాహా' కారం, పితృదేవతల నుద్దేశించి ఆహుతి నిచ్చినప్పుడు 'స్వధా'కారం ఉచ్చరిస్తారు.

స్వాహా స్వధా నామ మను ప్రభావైః
తృప్యంతి దేవాః పితరస్తథైవ।
యజ్ఞేషు సర్వేషు ముదాహరంతి
యన్నామ యుగ్మం శ్రుతిభిర్మునీంద్రాః॥

'స్వాహా' శబ్దానికి అర్థం :

సుష్ఠు హూయతే యయా ఇతి స్వాహా. ఆహ్వానించబడు దేవత స్వాహా. 'సుష్ఠు ఆహ్వయతి స్వాహా-దేవతాహ్వాన వాచకం స్వాహా.

సు ఆహా - స్వాహా అని వ్యుత్పత్తి. కల్యాణకరమైన అర్థాన్ని ప్రబోధించే వేదమంత్ర రూపవాక్కే-స్వాహా.

స్వయం తే సరస్వతీ ఆహా –

ప్రజాపతి తన తపస్సుచేత ప్రభవించిన ఘృతాన్ని అగ్నియందు హుతం చేసేటప్పుడు - అతనియొక్క వాక్కు

స్వా వాక్ అహా – అనగా వేదశక్తి - కర్తవ్యాన్ని బోధించింది. (బ్రహ్మవాక్కు వేదమే.) అప్పుడతడు ఆ ఘృతాన్ని అగ్నిలో వేశాడు. ప్రజాపతియొక్క వాక్కు అతన్ని ప్రేరేపించింది. కర్తవ్యబోధక స్వరూపిణియైన వేదమాత స్వాహా దేవి.

'స్వాహా' అంటే పరాశక్తి. పరాదేవత. మాయాశక్తి కనుకనే అమ్మవారి నామాలలో 'స్వాహా' నామం చెప్పబడింది.

'వాచం పద్మాలయాం పద్మాం శుచిం స్వాహాం
స్వధాం సుధాం'
(లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రం)

అదే విధంగా లలితాసహస్ర నామాల్లోనూ చెప్పబడింది.

స్వాహా స్వధా మతిర్మేధా శ్రుతిఃస్మృతి రనుత్తమా॥

దేవీ భాగవతంలో - ఈ పరాదేవతయే గాయత్రి అనీ, స్వాహా అనీ, స్వధా అనీ, వేదకళ అనీ స్తుతించబడింది.

గాయత్ర్యసి ప్రథమ వేదకలా త్వమేవ
స్వాహా స్వధా భగవతీ సగుణార్థ మాత్రా!
ఆమ్నాయ ఏవ విహితో నిగమో భవత్యా
సంజీవనాయ సతతం సురపూర్వజానామ్॥

స్వాహాభూతాదేవీ సకల మఖహోమేషు విహితా।
తదా త్వం సర్వజ్ఞా జనని ఖలుజాతా త్రిభువనే॥

'ఓ జననీ! సర్వజ్ఞా! వేదముల చేత, సకల యజ్ఞక్రియా హోమములయందు 'స్వాహా' రూపమున నీవు విధించబడితివి.

జగజ్జనని అయిన పరాశక్తే యజ్ఞశక్తిగా స్వాహా స్వధారూపధారిణి. గోపాల పూర్వతాపినీ యోపనిషత్తులో–

స్వాహాశ్రితో జగదైజయత్సురేతాః॥

పరమేశ్వర వశవర్తిని అయిన మాయాశక్తి 'స్వాహా' అని చెప్పబడింది.

కేనేదం విశ్వం సంసరతీతి?
స్వాహేదం సంసరతీతి,
కా స్వాహేతి?
తన్మాయా చేతి.

శ్రీకృష్ణుడు పరబ్రహ్మ. ఆయనను ఆశ్రయించిన మాయాశక్తి స్వాహాదేవి. ఆ శక్తియే జగత్కారిణి.

ఏ పరాశక్తి లక్ష్మి, సరస్వతి, దుర్గ, రాధ, గాయత్ర్యాది రూపాలతో ప్రకాశిస్తోందో ఆ శక్తే 'స్వాహా'.

ఏ పరమాత్మ విష్ణు, బ్రహ్మ, శివ, కృష్ణ, గణపత్యాది రూపాలతో పరిఢవిల్లుతున్నాడో ఆ బ్రహ్మమే 'అగ్ని'.

అగ్నిర్వై విష్ణుః-అగ్నిర్వై రుద్రః...అని వేద వచనం.

వేదమంత్రాలతో అగ్నియందు ఆహుతులు సమర్పించబడతాయి. వేదమంత్రమయమైనదే యజ్ఞం. ఆ వేదశక్తి స్వాహా. ఆ యజ్ఞమూర్తి అగ్ని.

స్వాహా- వేదశక్తి. వేదమే వాక్కు.

'స్వాహా వాగిత్యుచ్యతే', స్వాహాయే వాక్కు.

అగ్నేర్వాచశ్చ సంబంధాత్-అగ్నికీ వాక్కుకీ వున్న ఈ సంబంధంచేతనే వాక్కుని 'అగ్నాయీ' అన్నారు. అగ్ని వాక్కుని అధిష్ఠించే దైవం.

స్వాహా వై కుతః సంభూతా?

మొదలైన ప్రశ్నలకి సమాధానం చెప్తూ వేదం ఇలా అంటోంది.

"స్వాహా వై సత్య సంభూతా... బ్రహ్మణో దుహితా.
త్రీణ్యక్షరాణి ఏకం పదం, త్రయోఽస్యై వర్ణాః శుక్లః
పద్మః సువర్ణ ఇతి. చతురోఽస్యై వేదాః శరీరమ్.
షడంగాన్యంగాని
ఓషధి వనస్పతయో లోమాని ద్వేచాస్యాః శిరసీ.
ఏకం శిరోమావాస్యా ద్వితీయా పౌర్ణమాసీ.
చక్షుశ్చంద్రాదిత్యౌ, ఆజ్యభాగౌ హుతమ్
ఋగ్యజుస్సామగతిః—
సా స్వాహా, సా స్వధా, సా వషట్కారః
...తస్యా అగ్నిర్దైవతమ్!"

—స్వాహాదేవి యొక్క విరాడ్రూపవర్ణన ఇది.

వేదాత్మకఅయిన వాగ్దేవే స్వాహా అన్నది స్పష్టం. ఆ స్వాహాయే స్వధా, వషట్కారం.

# స్వధాదేవి

అగ్ని వాయు సూర్యులు... ఈ ముగ్గురూ లోక త్రయాభిమాన దేవతలు. నిజానికి ఈ ముగ్గురూ అగ్ని మూర్తులే.

వీరే పితరులుగానూ, సస్యవృష్ట్యాదులలో పెంపొందింపజేసే భూః-భువః-స్వః లోకముల మాతలుగానూ నిర్దేశింపబడ్డారు.

'స్వేనలోకాన్ దధాతీతి స్వధా। తైః అగ్ని వాయు సూరైశ్చః'...

పితరులు-అగ్ని వాయు సూర్యులు-లోకములను ధరించి వున్నారు. వారిచేత ధరించబడే జగత్ శక్తి స్వధ.

'స్వధా'-జీవుని భోగానికి సంబంధించిన శక్తి.

జీవునిచేత పుణ్య, పాప కర్మలను అనుభవింపజేసే పరాశక్తి స్వధా. ఈ భోగరూపంగా జీవులను ధరించివుంది. జీవుని భోగానికి, శరీరానికి 'స్వధ' నిమిత్తమవుతోంది.

శరీర పోషకమైన అన్నశక్తి కూడా స్వధాదేవి,

జీవుని రాకపోకలకు కారణం స్వధలు.

జీవుని అనుసరించి వుండే స్వవిద్య, కర్మ, పూర్వప్రజ్ఞ-వీటినే 'స్వధలు' అంటారు. వీటిద్వారా జీవుడు వివిధ లోకాలలో చరిస్తుంటాడు.

అగ్ని వాయు సూర్యులే 'పితరులు' అన్నాం. వారే క్రమంగా వసు, రుద్ర, ఆదిత్య రూపులు. వీరే శ్రాద్ధ దేవతలైన పితరులు.

వసురుద్రాదితి సుతాః పితరః శ్రాద్ధదేవతాః।
ప్రీణయంతి మనుష్యాణాం పితౄ శ్రాద్ధేన తర్పితాః॥
ఆయుః ప్రజాం ధనం విద్యాం స్వర్గం మోక్షం
సుఖానిచ।
ప్రయచ్ఛంతి తథారాజ్యం ప్రీతానృాణాం పితామహాః॥

వసు రుద్ర ఆదిత్యులు శ్రాద్ధదేవతలైన పితరులు. శ్రాద్ధంచే తర్పితులయ్యేవారు వీరు. అలా తృప్తిపడిన వీరు మనుష్య పితరులకు తృప్తినందిస్తారు. ఈ వసు రుద్రాదిత్యులనే పితరులు ప్రీతులై ఆయుష్య ప్రజాధనాది ఫలాలను, స్వర్గమోక్ష సుఖాలను ప్రసాదిస్తారు.

శ్రాద్ధకర్మయందు ఉద్దిష్టులైన పితరులు మనుష్య పితరులే. కానీ వసురుద్రాదిత్యరూపులుగా అర్చించబడతారు. ఇది సంప్రదాయం.

వసువులు పితరులు. రుద్రులు పితామహులు. ఆదిత్యులు ప్రపితామహులు. పితృ, పితామహ, ప్రపితామహులను ఉద్దేశించే శ్రద్ధాపూర్వక (శ్రాద్ధ) కర్మలతో, తాము తృప్తిపడి, మనుష్య పితరులను తృప్తిపరచి, కర్మకర్తలైన పుత్రాదులకు ఆయుః ప్రజాది ఫలాలనొసగేది ఈ పితరులే.

పితరులకు అగ్ని-వాయు-సూర్యలోకాలు స్థానాలు. వసు-రుద్ర-ఆదిత్యులు మూర్తులు. బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులు అధిపూరుషులు.

'స్వధ' పితరులనుద్దేశించే వాగ్రూపిణి. అన్న, జల, అమృతరూపిణి అయిన శక్తిరూపిణి.

స్వధా పితృభ్యః—అనే మంత్రం ప్రకారం—పుత్రుల చేత అర్పింపబడే హావిర్లక్షణాన్నరూపమే 'స్వధ'. ఈ స్వధ పరమేశ్వర శక్తిరూపం. పరమేశ్వరానుగ్రహంచేత, స్వధా శక్తిచేత, ఈ 'అన్నం' అమృతమై, పితరులకు జీవనహేతువౌతోంది.

జీవులకు పునరావృత్తిరహిత శాశ్వత బ్రహ్మలోక నిత్యనివాస సిద్ధిని కలిగించే త్రయీవిద్యాశక్తి—స్వధ.

'స్వర్గంలోకం దధాతి యజమానస్యేతి-స్వధా'

పితరుల ఊర్ధ్వలోక గతికి కారణమైనదీ, కర్మ చేసిన యజమానుని ఊర్ధ్వగతికి కారణమైనదీ—స్వధాశక్తి.

పితృకర్మ చేసిన పుత్రాదులు స్వధాశక్తికృపచేత ఉత్తమగతిని పొందుతారు.

స్వం ఆత్మానం దధాతీతి స్వధా- ఆత్మను ధరించు శక్తి, బలం, తేజస్సు—స్వధా.

ఆత్మను లేక పరమాత్మను ప్రతిపాదించే వేదవాక్కు-స్వధా-అని భాష్యం.

స్వం ఆత్మానం సర్వాంతర్యామిణం భగవంతం నారాయణం ధారయతీతి-స్వధా. ఆత్మరూపుడైన పరమేశ్వరుని ధరించుటచే ఉదకములకు 'స్వధా' అని పేరు.

ఈ అన్నోదకాలు అంతర్యామి అయిన నారాయణుని ధరించి స్వధారూపాలై, పితరులను, పుత్రాది యజమానుల్ని తరింపజేస్తున్నాయి.

స్వాహా, స్వధా శబ్దాలకు ఇంత విస్తృతార్థం వుంది.

వాగర్థ స్వరూపుడైన పరమేశ్వరుడే అగ్ని. పరాశక్తి వాగ్రూపిణి. ఈశ్వరుడు అర్థరూపుడు. బ్రహ్మవాచకాలైన స్వాహా, స్వధా, వషట్కారాలతో ప్రకాశించే బ్రహ్మమే-అగ్ని.

ప్రణవ్య ఋగ్యజుః సామ్నే
స్వాహాయ చ స్వధాయ చ
వషట్ కారాత్మనే చైవ తుభ్యమ్॥...అని మత్స్య పురాణంలో పరమేశ్వర స్తోత్రం.

స్వాహా స్వధా వషట్కారాలు పరమేశ్వరవాచకాలు. పరమేశ్వర ప్రతిపాద్యాలు. ఆయనను చెప్పే వాక్కులు ఆయనకు భిన్నముకావు. బ్రహ్మము గురించి చెప్పగలిగేది బ్రహ్మమే. ఆయనను చెప్పే వాక్కులు ఆయన రూపాలే.

బ్రహ్మమును చెప్పూ బ్రహ్మములో విలీనమయ్యేవి వాక్కులు. కనుక వాక్కే బ్రహ్మము.

స్వాహాదేవే అగ్ని, అగ్నే స్వాహాదేవి. కనుకనే అగ్నిరూపుడైన పరమేశ్వరుని 'స్వాహా స్వధా వషట్కారాత్మా' అని స్తోత్రించారు. విష్ణు సహస్రంలో 'విశ్వం విష్ణుః వషట్కారః' అని చెప్పబడింది.

# వషట్కారం

స్వాహా, స్వధా శబ్దాల లాగానే 'వషట్కారం' కూడా పరమేశ్వర వాచకమే. దేవహవిర్దాన వాచకమైన మంత్రం. యజ్ఞాలలో కొన్నిచోట్ల స్వాహాకారపూర్వకంగానూ, మరికొన్నిచోట్ల వషట్కార పూర్వకంగానూ హవిర్దానం చేస్తుంటారు.

అభిమత ఫలాలను ప్రసాదించే పరాశక్తే వషట్కారం.
ఓజస్సు, సహస్సు అనే శక్తులు కలిసి వషట్కారం.
'వషట్' యొక్క శరీరాలు ఓజస్సహస్సులు.
'ఓజస్సు' అంటే జగత్తులను ధరించే పరమేశ్వర శక్తి.
'గామావిశ్య చ భూతాని
ధారయామ్యహ మోజసా' అని గీతావచనం.

సమస్త భూతకోటినీ, విశ్వాన్నీ ధరించేది కామరాగ వివర్జిత పరమేశ్వర శక్తి. ఆ జగద్ధారకశక్తే ఓజస్సు. ఈ ఓజో బలం చేతనే పృథ్వి అధఃపతనం కాకుండా, బద్దలవకుండా కాపాడబడుతోంది. ఈ శక్తితోనే ఈశ్వరుడు పృథివియందు ప్రవేశించి, జగత్తులను ధరిస్తున్నాడు.

'ఓజసా బలేన, యద్బలం కామరాగ వివర్జితమైశ్వరం
జగద్విధారణాయ పృథివ్యాం ప్రవిష్టమ్
యేన గుర్వీ పృథివీ నాథః పతితా న విదీర్యతీ చ।'

'సహాస్సు' అంటే శత్రువులను తిరస్కరించే శక్తి. కామరాగాది వర్జితమైన శక్తి-'ఓజస్సు'. అరిషడ్వర్గాలైన కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్యాలను తిరస్కరించే శక్తి-'సహాస్సు'. ఓజస్సహాశ్శక్తి సంపన్నుడు పరమేశ్వరుడు.

ఓజస్సహాస్ శక్తులే వషట్. ఆ శక్తులు కలవాడగుటచే పరమేశ్వరుని "వషట్కారః" అన్నారు.

స్వాహా, స్వధా, వషట్-మూడూ ఒక్కటే అని గ్రహించాలి. వాటి లక్షణాలను, కార్యాలనుబట్టి మూడు విధాలైన పేర్లు వున్నాయి. అంతే.

వాగ్రూపిణియై, అన్నరూపిణియై, ఓజస్సహాస్వరూపిణియైన పరాశక్తి ఆ తల్లి. ఆ తల్లితో కలసి వెలిగే తండ్రి పరమేశ్వరుడే అగ్ని.

## వాగధిదేవత

మన ఇంద్రియాలలో ఒక్కో ఇంద్రియానికీ ఒక్కో దేవత అధిష్ఠితుడై వుంటాడు.

బుద్ధికి బ్రహ్మ, అహంకారానికి ఈశ్వరుడు, మనస్సుకి చంద్రుడు, శ్రోత్రానికి దిక్కులు, త్వక్కుకి (చర్మానికి)

వాయువు, నేత్రాలకు సూర్యుడు, నాలుకకు వరుణుడు, నాసికకు పృథివి, వాక్కుకి అగ్ని, హస్తాలకు ఇంద్రుడు, పాదాలకు విష్ణువు, గుదానికి మిత్రుడు, గుహ్యానికి ప్రజాపతి-అధిష్ఠాన దేవతలు.

కనుక వాక్కుకి అగ్ని అధిష్ఠాన దేవత అని గ్రహించాలి. వాఙ్మయమంతా అగ్నిమయమే. మంత్రములు, స్తోత్రములు మొదలైనవన్నీ అగ్నిరూపాలే.

సుశబ్దాలు, ప్రియహిత సత్యవచనాలు మనల్ని రక్షించే అగ్ని. అపశబ్దాలు, అప్రియ అసత్యవచనాలు మనల్ని శిక్షించే అగ్ని.

ఈ విధంగా శబ్దబ్రహ్మకూడా అగ్నియే. కనుకనే శబ్దాన్ని జ్యోతిగా దర్శించారు.

ఇదమంధం తమః కృత్స్నం జాయేత భువనత్రయమ్,
యది శబ్దాహ్వయం జ్యోతిరాసంసారం న దీప్యతే॥

శబ్దజ్యోతి ప్రకాశం లేకపోతే ముల్లోకాలూ అంధకార బంధురాలే.

# సూర్యుడు అగ్ని

నిరుక్త ప్రకారంగా-అగ్నియే ఆదిత్యుడు. అతడే ఋగ్యజుస్సామములను ప్రేరేపిస్తున్నాడు.

వహ్నిరాదిత్యో భవతి. సత్రిస్రోః వాచః ప్రేరయతి.

అగ్నియొక్క వ్యక్తరూపం సూర్యుడు. ఆ అగ్నియందే జలాలు హుతమై అవి మేఘాలుగా వర్షిస్తున్నాయి.

'పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః' అని ఆదిత్య హృదయం.

తన కాంతికిరణాలతో రక్షిస్తూ, తపింపజేస్తూ, వర్షింపజేసేవాడు ఆదిత్యరూప అగ్ని. సూర్యుడు అగ్ని గనుకనే, అతడు ఉదయించే తూర్పుదిక్కును 'యజ్ఞవేదిక' అంటారు.

వెలుగులు ఆ అగ్నిమూర్తి అనుగ్రహమే. అతడే కర్మసాక్షి. బ్రహ్మ విష్ణు శివాత్మకుడు, వేదస్వరూపుడు.

ఆ సూర్యరూప అగ్నిని నమస్కరిస్తే సర్వదేవతా నమస్కారమే. అతడు సర్వదేవతాత్మకుడు కనుక, ఏ దేవతనైనా సరే సూర్యునిలో భావిస్తూ నమస్కరిస్తే, ఆ దేవతానుగ్రహం లభిస్తుంది. సాయుజ్యాది మోక్షాలు సిద్ధిస్తాయి. కనుక నిత్యం సూర్యుని నమస్కరించాలి.

ఉదయం 'మిత్రా' అనే పేరుతో, మధ్యాహ్న సమయాన 'పూషా' అనే పేరుతో, సాయంత్రం 'వరుణ' అనే పేరుతో-త్రేతాగ్ని స్వరూపుడుగా ప్రకాశిస్తాడు సూర్యుడు.

మేధో సంబంధమైన సంస్కారకారకుడు 'మిత్రుడు'. పోషకుడైన అగ్నిరూపుడు 'పూషా'. బలవీర్యదాయకుడు 'వరుణుడు'. కనుకనే ఉదయ సంధ్యలో 'మిత్రోపస్థానం', సాయం సంధ్యలో 'వరుణోపస్థాన' మంత్రాలను పఠిస్తారు ద్విజులు.

సూర్యుడు ప్రకాశరూపుడు, తేజోమయుడు, ఉష్ణతా మూర్తి. కనుక భౌతికదృష్టితో చూసినా, అతడు మహాగ్ని మూర్తి. కేవలం అగ్నిమూర్తే.

ఏష చైవాగ్ని హోత్రం చ
ఫలం చైవాగ్ని హోత్రిణాం-అని ఆదిత్య హృదయం. సూర్యుడే అగ్నిహోత్రం. అగ్నిహోత్రులకు ఫలప్రదాత కూడా ఆయనే.

సూర్యనామాలలో 'జఠరాగ్ని', 'ఇంధనాగ్ని'- మొదలైన నామాలు కూడా పేర్కొనబడడం విశేషం. అగ్ని సూర్యరూపుడై వెలుగునీ, శక్తినీ అందజేస్తున్నాడు. సూర్యుడు అగ్నిరూపుడై దీపాది కాంతుల్ని, అంధకారంలో కూడా ప్రసాదిస్తున్నాడు.

# త్రేతాగ్నులు

అగ్ని-(1) అధియజ్ఞంగా-గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్ని-అనే త్రేతాగ్నుల స్వరూపుడు.

(2) అధిదైవికంగా-పృథ్వి, అంతరిక్ష, ద్యులోకాలలో వుండే-అగ్ని, వాయు, ఆదిత్యాత్మక త్రేతాగ్ని రూపుడు. పృథ్విలో అగ్నిగా, అంతరిక్షంలో వాయువుగా, ద్యులోకంలో ఆదిత్యుడిగా ప్రకాశించేది అగ్నే.

పృథ్వియందు అగ్ని, వసువులుగా; అంతరిక్షంలో రుద్ర, మరుత్, ఇంద్ర, వాయు, పర్జన్య రూపాలుగా;

ద్యుస్థానంలో ద్వాదశాదిత్యులుగా వుండే దేవతా స్వరూపాలు అగ్నిరూపాలే.

(3) ఆధ్యాత్మికంగా-శరీరాంతర్గతమైన అగ్ని.

మన శరీరంలో 'జ్ఞానాగ్ని'కి స్థానం-ఆత్మ. 'కాలాగ్ని'కి స్థానం-పాదం. 'క్షుధాగ్ని'కి స్థానం-నాభి. 'శీతాగ్ని'కి స్థానం-హృదయం. 'కోపాగ్ని'కి స్థానం—నేత్రం.

ఇతర చతుర్భూతాలలో (భూమి, నీరు, వాయువు, ఆకాశాలలో) నిహితమైవున్న అగ్ని మన శరీరాంగాలలో ప్రతిష్ఠితుడై వున్నాడు. భూతతత్వాలలో అంతర్భూతంగా వున్న అగ్నికి వుండే స్థానాలు-

జిహ్వ-ఉదకంలో అగ్ని; ఘ్రాణం (నాసిక)-పృథ్విలో అగ్ని; చక్షువు-అగ్నిలో అగ్ని; ఉదానవాయువు-అగ్నిలో వాయువు; బుద్ధి-అగ్నిలో ఆకాశం; త్వక్కు-(చర్మం) వాయువులో అగ్ని; శ్రోత్రం-ఆకాశంలో అగ్ని; రూపం-అగ్నిలో ఉదకం; పాదం-అగ్నిలో పృథ్వి. ఇలా శరీర గతంగా పంచభూతాలలో వున్నాడు అగ్ని.

అయితే-అగ్ని పంచభూతాలలో ఒకటి మాత్రమే కాదు, పంచభూతాలకు మూలమైన సచ్చిదానంద తత్వమూ అగ్నే. దానినే 'చిదగ్ని' అంటారు.

(4) పృథ్వియందు, ఓషధులయందు, జలాలయందు ప్రకటంగా, నిగూఢంగా వ్యాప్తమైన అగ్ని.

అగ్నే యత్తే దివి వర్చ ఇతి, ఆదిత్యో వా అస్య దివి వర్చః, పృథివ్యామితి, అయమగ్నిః పృథివ్యామ్, యదోషధీష్వప్స్వా యజత్రేతి, య ఏవౌషధిషు చాప్సు చాగ్నిస్తమేతదాహ। యేనాంతరిక్షముర్వా తతంథేతి। వాయుః సః త్వేషః స భానురర్ణవో నృచక్షా ఇతి॥

-ఇలా సర్వం అగ్నిమయమని వేదవచనం.

(5) ప్రాణులయందు సాక్షిరూప అగ్ని.

—ఈ విధంగా అయిదు విధాలుగా అగ్ని సర్వాత్మకుడు.

"సర్వాత్మకః అగ్నిః జ్యోతిః స్వప్రకాశరూపం పరబ్రహ్మాఖ్యం తేజః."

అగ్ని-స్వప్రకాశరూపుడైన, సర్వాత్మకుడైన, జ్యోతి స్వరూపుడైన తేజోరూపుడైన పరబ్రహ్మ-అని వేదఋషులు స్పష్టంగా ప్రతిపాదించారు.

కాంతివల్లనే వర్ణాలు ఏర్పడతాయి. వర్ణాల వల్లనే ఆకృతులు గోచరిస్తాయి. కాంతి అగ్నిరూపమే. కనుక-గోచరించే సకల జగత్తూ అగ్నిమయమే.

సృష్టి స్థితి లయకారకుడైన ఈశ్వరుడే అగ్ని.

సువర్ణం అగ్నివల్లనే లోహమవుతుంది. అగ్నివల్ల కరిగి, అగ్నివల్లనే ఆభరణాదిరూపాలు ధరించి, మళ్ళీ అగ్ని వల్లనే కరిగిపోయేది సువర్ణం. అగ్నే ఆకృతినిస్తుంది. అగ్నే ప్రాణశక్తియై నిలుపుతుంది. అగ్నే ఆ ఆకృతుల్ని సంహ

రిస్తుంది. విలీనం చేసుకుంటుంది. అస్తిత్వాన్నిచ్చేదీ, అస్తిత్వాన్ని రూపుమాపేదీ అగ్నే.

సృష్టికారణంగా మంగళరూపమైన అగ్ని, ప్రళయ కారణంగా కాలాగ్ని రుద్రమూర్తి. శరీరం శవం కాకుండా చైతన్యంగా వుంచేది అగ్ని. ఆ అగ్ని శరీరాన్ని విడిచిపెడితేనే, చల్లబడ్డ మృతదేహాన్ని అగ్నికి అర్పిస్తారు. దహనమే కాక, ఖననం కూడా అగ్నికి అర్పించేదే.

యజ్ఞక్షేత్రంలో గార్హపత్యాగ్ని నుండి వచ్చినవే ఆహవనీయ, దక్షిణాగ్నులు.

ఆహవనీయాగ్ని దేవపథానికి సంబంధించినది. దక్షిణాగ్ని 'పితృ' పథానికి సంబంధించినది.

ఆహవనీయాగ్ని వాక్, జ్ఞానాదులను ప్రసాదించే మేథోబలప్రదాయకుడు. ఆహవనీయాగ్నిని ఉపాసించడం వల్ల దేవ, ఋషి ఋణాల నుండి విముక్తులమవుతాం.

దక్షిణాగ్ని పితృఋణ విమోచకుడు. బలవీర్య ప్రదాయకుడు. ఈ అగ్ని ద్వారా సత్సంతాన ప్రాప్తి, వంశాభివృద్ధి, తద్వారా పితౄణ విమోచనం సంభవం.

గార్హపత్యాగ్ని పోషకుడు. అన్నవస్త్రాదులనిచ్చే గృహపోషకుడు.

మన దేహంలోనే ఈ త్రేతాగ్నులూ వున్నాయి. మనం ఆ విధమైన జ్ఞానంతో వుండి సత్కర్మాచరణ చేయడం త్రేతాగ్నుల ఉపాసనే.

స్ఫురణ, స్మరణ, జ్ఞానం మొదలైనవాటికి సంబంధించిన మేధోబలకారక శక్తి 'ఆహవనీయాగ్ని'. ఇది శరీర ఊర్ధ్వ భాగానికి సంబంధించినది. సద్బుద్ధి, జ్ఞానసముపార్జన, స్వాధ్యాయం మొదలైనవి 'ఆహవనీయాగ్ని ఉపాసనే'నని భావించాలి.

శరీర గృహానికి పోషకమైన ఆహార పదార్థాలను స్వీకరించి, జీర్ణింపజేసి, ఆ సారాన్ని సర్వావయవాలకు అందజేసే 'పూషా' సంబంధమైనది (పోషకమైనది) 'గార్హపత్యాగ్ని'. ఇది హృదయకేంద్రమైనది. ఈశ్వర నివేదితమై, సక్రమార్జితమై, శుచిగా వండిన మితసాత్వికాహార సేవనం 'గార్హపత్యాగ్ని ఉపాసనే'నని భావించాలి.

నాభికిందనున్న ప్రదేశం 'దక్షిణాగ్ని' స్థానం. వంశవృద్ధికారకం. బలవీర్యశక్తి, సౌశీల్యం, సత్ప్రివర్తన, బ్రహ్మచర్యం వంటి సల్లక్షణాలతో ఈ అగ్నిని రక్షించుకోవాలి. ఇదే 'దక్షిణాగ్ని ఉపాసన'గా భావించాలి.

## మంథనాగ్ని

రాపిడివలన అగ్ని పుడుతుంది. రెండు రాళ్ళు, రెండు కర్రలు, అగ్గిపెట్టె మొదలైనవాటి రాపిడివలన పుట్టే అగ్ని. అందుకే దీనిని 'మంథనాగ్ని' అంటారు.

## దావాగ్ని

దారుగతంగా వహ్ని వుంటుంది. దారువుల ఘర్షణలో ఆ వహ్ని ప్రజ్వరిల్లుతుంది. వాయువశంతో అరణ్యగత వృక్షాలకు ఘర్షణ జరిగినప్పుడు అగ్ని ప్రజ్వరిల్లుతుంది. ఆ అగ్ని (దారుగతమైన అగ్ని) క్రమంగా అరణ్యాన్నే మండిస్తుంది. దానినే 'దావాగ్ని' అంటారు.

బాగా ఎండిన వెదురు బొంగులకు ఘర్షణ ఏర్పడి కూడా దావాగ్ని రగులుతుంది. ఆ క్రమంలో వెదురు మొదళ్ళలో, అగ్ని ప్రభావంచేత ముత్యాలు ఏర్పడతాయని అంటారు.

## అరణి

అరణి విద్యను ఋషులు ఉపాసించారు.

యజ్ఞారంభంలో అగ్నిని ఆవిర్భవింపజేయడం మొదటి ప్రక్రియ. జువ్వి, లేక జమ్మి కొయ్యతో చేసిన పాత్ర, కవ్వం ఉపయోగించి శుచిగా మధనం చేస్తారు.

ఆ మధన సమయంలో ఋత్విజులు అగ్ని సంబంధ మంత్రాలను చదువుతారు. ఇది అంతర్యామిగా వున్న అగ్నిని ప్రార్థించడం. ఈ మంత్రాలనే 'ఆరణ్యకాలు' అంటారు. అరణి మథన సమయంలో చదివే వేదభాగాలు కనుక ఆ పేరు. అంతేకానీ 'అరణ్యాల్లో చదివేవి' అని అర్థం కాదు.

అంతర్యామి అయిన అగ్ని భగవానుడే, ఈ అరణి నుండి ఆవిర్భవిస్తాడని ఋషిదృష్టి.

ఈ అగ్ని మహాశక్తివంతమైనది. శుద్ధమైనది. దీనితో యజ్ఞం నిర్వహించబడుతుంది. యజ్ఞమూర్తిగా అగ్ని సత్ఫల ప్రదాయకుడౌతాడు.

## తపోగ్ని

ఇది తపస్సుచేత కలిగే తీక్ష్ణప్రకాశం. మంత్ర నియమాదులతో చేసే తపస్సు, ఆయా తపస్వుల సంస్కారాను గుణంగా వుంటుంది. వారి వారి తపోబలాన్ని అనుసరించి ఈ అగ్ని వేగం వుంటుంది.

సాత్త్విక, రాజసిక, తామసిక గుణాలననుసరించి తపస్సు కూడా ఆ మూడు విధాలవుతుంది. వీటిలో సాత్త్విక తపస్సు శ్రేష్ఠం. తీవ్రమైన తపస్సు ద్వారా ప్రభవించే తపోగ్ని లోక సంచారం కూడా చేస్తుంది. ఆ సంచారవేగం ఆ తపస్వి యొక్క నిష్ఠననుసరించి వుంటుంది. రాక్షసుల తపోగ్ని కామసంగతం గనుక, రాక్షస బుద్ధితో కూడింది గనుక త్రిలోకాలకీ దుర్భర వేదనని కలిగిస్తుంది. నిష్కాములైన వారి తపోగ్నిలో అన్ని కర్మలూ హుతమై, వారికి మోక్షఫలాన్ని ప్రసాదిస్తుంది.

## వర్చస్సు

సత్కర్మ, స్వాధ్యాయం—వీటి ద్వారా శరీరం శుద్ధమై, వర్చోరూపంగా అగ్ని శరీరాన్ని ప్రకాశింపజేస్తాడు. ఆధ్యా

త్మికంగా మహోన్నత స్థితినందినవారు దివ్యతేజస్సుతో ప్రకాశించడానికి కారణం ఇదే.

వేదాధ్యయనం మొదలైన వాటివల్ల కలిగే వర్చస్సు బ్రహ్మవర్చస్సు. వాక్కు అగ్ని. వేదం అగ్ని. వేదమే బ్రహ్మము. అధ్యయన రూపంలో ఆ బ్రహ్మము ప్రకాశించి, ఆ అధ్యయన శీలుణ్ని బ్రహ్మవర్చస్సుతో ప్రకాశింప జేస్తుంది.

## క్రోధాగ్ని

తపింపజేసే ఏదైనా అగ్నే. క్రోధమూ అగ్నే. అయితే ఇందులోనూ ఉభయపార్శ్వాలూ వున్నాయి.

అధర్మంపట్ల ధర్మవేత్తలకి కలిగే కోపం ఉత్తమమైనది. ఇది ఆత్మవృద్ధి కారకమైనదే. ఈశ్వరుడే ఈ క్రోధాగ్ని స్వరూపుడై అధర్మాన్ని శిక్షించి, ధర్మాన్ని రక్షిస్తాడు.

ఈ క్రోధం ధర్మరక్షాకరమైనది. ఈ కారణం చేతనే మహాలక్ష్మిని 'క్రోధ సంభవా' అన్నారు. పరాశక్తి ధరించిన అంకుశాయుధం క్రోధస్వరూపమే. 'క్రోధాకారాంకుశోజ్వలా' అని లలితానామంగా పేర్కొన్నారు. క్రోధాగ్ని రూపంగా పరమేశ్వరుడు దుష్టజన శిక్షణ చేశాడు. క్రోధంలో ప్రళయాగ్ని సమానుడని, ధర్మరక్షకుడైన శ్రీరామచంద్ర మూర్తిని వర్ణించింది శ్రీమద్రామాయణం.

ఇక-అధమమైన క్రోధం—స్వార్థ, అహంకార, అజ్ఞాన జనితమైనది. ఈ క్రోధం వివేకాన్ని దహిస్తుంది. ఈ

క్రోధాగ్ని కన్నులలోనూ, తరువాత పరుషవాక్కులద్వారా వ్యక్తమవుతుంది. ఇది ఆత్మాభ్యున్నతిని దహింపజేస్తుంది.

## కామాగ్ని

కామమూ అగ్నే. ఇది లేనప్పుడు సృష్టే లేదు. పరబ్రహ్మయొక్క జ్ఞాన క్రియాత్మక దైవీమాయ ఈ సృష్టికి కారణం.

'కామం' శరీరగతమై, స్త్రీ పురుషుల్ని (ప్రకృతీ పురుషుల్ని) ప్రేరేపిస్తుంది. ఈ 'కామం' ప్రజోత్పత్తికి హేతువు. వంశవృద్ధి కారకమైనది.

ధర్మాఽవిరుద్ధో భూతేషు
కామోస్మి భరతర్షభ॥

—"సమస్త ప్రాణికోటిలో ధర్మానికి విరుద్ధంకాని కామం-నా స్వరూపమే" అని శ్రీకృష్ణపరమాత్మ వచనం.

ఈ కామాగ్నిచేత స్త్రీ పురుషులు ప్రేరితులు కావడంతో, ప్రాణాగ్ని స్త్రీ గర్భమందు నిహితమవుతుంది.

"మాతా పూర్వరూపమ్-పితోత్తర రూపమ్-
ప్రజా సంధిః"-అని వేదం.

పురుషుడు ఉత్తరారణి, స్త్రీ పూర్వారణి కాగా, ఉద్భవించే అగ్ని సంతానరూపమైనది.

ప్రజ్వరిల్లుతున్న అగ్నిలో ఒక్క రవ్వ మరోచోట చేరి ప్రజ్వరిల్లడం వంటిదే ఇది. దీపం నుండి మరో దీపం ప్రభవించినట్టుగా ఈ ప్రజాతంతువు కొనసాగుతుంది.

ధర్మవిరుద్ధమైన కామం వినాశనానికి హేతువు. అగ్ని వెలుగునీ ఇస్తుంది. కాల్చి వేస్తుంది కూడా... అనే విషయాన్ని మరోసారి స్మరించుకోవాలి. ధర్మసమ్మతమైన కామం సృష్టి చక్రాన్ని సక్రమంగా కొనసాగింపజేస్తుంది.

ఈ విధంగా కామాగ్ని సృష్టికారకమైంది. సర్వజీవులలోనూ ఈ కామాగ్ని వున్నది.

కామాగ్నినికూడా దహింపజేసేది జ్ఞానమయ శివాగ్ని. ఇదే శివుని కామదహనలీల. కామాది సృష్ట్యున్ముఖ క్రియాకలాపాన్ని, బంధనాన్ని దహింపజేసి కైవల్యాన్ని సాధింపజేసే శివాగ్నే జ్ఞానాగ్ని.

## యోగాగ్ని

యోగసిద్ధుల శక్తితో ఉద్భవించే యోగాగ్ని.

సిద్ధిపొందిన యోగీశ్వరులు, యోగం చేతనే శరీర బంధనాన్ని త్యజించి మోక్షాన్ని పొందుతారు.

'యోగేనాంతే తనుత్యజామ్' అని రఘువంశరాజుల నుద్దేశించి కాళిదాసు వర్ణించాడు.

ఈ యోగాగ్ని కూడా సమస్త కర్మల్నీ దహింపజేసే మోక్షప్రదాయకమైనది. సతీదేవి దక్షయజ్ఞ సమయంలో, ఈ యోగాగ్నితోనే శరీరాన్ని త్యాగం చేసింది.

పాదపద్మములందు ప్రభవించునప్పుడు
ప్రత్యగ్ర యావకద్రవము చెలువు
కటిమండలంబుపై గనుపట్టునప్పుడు
కనక కాంచీదామకంబు డాలు
వలుద చన్నులమీద మొలతెంచునప్పుడు
కాశ్మీరజాంగరాగంబు పొలుపు
సీమంత పదమున జిగురొత్తునప్పుడు
రమణీయ సిందూరరజము సొబగు
ప్రోదిసేయుచు భర్గున భుజగహారు
రాణివాసంబు దివ్యవిగ్రహమునందు
రవులుకొని మండె నాస్థానరంగభూమి
నధిక రోషోత్థితంబు యోగానలంబు.

జగజ్జనని తనయందు నిహితమైన యోగాగ్నిని, అధిక రోషంతో ప్రజ్వలింపజేసింది. ఆ తల్లి లీలాధృతఛాయా విగ్రహాన్ని దహింపజేసుకున్న యోగాగ్నివైభవాన్ని శ్రీనాథుడు కాశీఖండంలో పై విధంగా వర్ణించాడు.

## శాపాగ్ని

మనం పురాణాల్లో ఋషులు, మహాత్ములు శాపాలివ్వడం అనే కథలు వింటూ వుంటాం.

ధర్మపరాయణులు, తపస్వులు, నియమవంతులు, నిష్ఠాపరులు అయిన మహాత్ముల బుద్ధికీ, వాక్కుకీ మహా

శక్తి వుంటుంది. వారి ధర్మం ద్వారా, సత్యనిష్ఠ ద్వారా, వాఙ్నియమం ద్వారా-వాక్కు అమోఘశక్తివంతమౌతుంది. ఆ మహానుభావులకు, జగద్ధితంగా మనోభావతీవ్రత కలిగి, అది శాపంగా వాక్కు-ద్వారా వ్యక్తమవుతుంది.

వాక్కు అగ్నిస్వరూపం గనుక, అది శాపంగా వచ్చినప్పుడు సత్యమై, శిక్షారూపం అవుతుంది. దీవెన వరమై సత్యమై, రక్షకమవుతుంది.

వ్యక్తుల సంకల్పబలం, మనోశుద్ధిబట్టి వాక్కు అమోఘమవుతుంది. అందుకే పెద్దలచేత దీవెనలు పొందడం మన సంప్రదాయం,

పాతివ్రత్య పరమశక్తితో స్త్రీ వాక్కు అమోఘమవుతుంది. కనుకనే సీతాసాధ్వి 'శీతోభవ హనూమతః' అని అనడంతో, ఆ వాగగ్ని ప్రభావంచేత, హనుమంతుని తోక మంట చల్లబడింది.

అదేవిధంగా దమయంతి వంటి సాధ్వీమణులు, తమ పాతివ్రత్య పరమ తేజంతో, దుష్టులనుండి తమను రక్షించుకునేందుకు, ఈ వాగగ్నినే (శాపాగ్ని) ఉపయోగించారు. ఆ అగ్నిద్వారా దుష్టులు దగ్ధులయ్యారు.

## శోకాగ్ని

శోకంకూడా అగ్నే. ఈ శోకం తనని దహించుతుంది. (తపింపజేస్తుంది) అంతేకాదు-కొందరి శోకం, ఆ శోక కారకులైన వారిని దహిస్తుంది.

సీతాదేవి శోకమే 'అగ్ని'యై లంకను కాల్చిందని ఒక కవిమహర్షి భావన. వాయువు అగ్నిని వ్యాపింపజేస్తాడు. అదే విధంగా వాయుదేవుని కుమారుడైన ఆంజనేయుడు, సముద్రాన్ని దాటి లంకకొచ్చి, జానకీదేవి శోకాగ్నిని తీసుకొని, ఆ శోకాగ్నితోనే లంకా దహనం చేశాడట.

ఉల్లంఘ్య సింధోస్సలిలం సలీలం
యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః।
ఆదాయ తేనైవ దదాహ లంకాం
నమామి తం ప్రాంజలిరాంజనేయమ్॥

ఆ విధంగా సీతాదేవి శోకాగ్నితో లంకా దహనం గావించిన ఆంజనేయస్వామిని నమస్కరించారు.

మందాగ్ని, తీక్ష్ణాగ్ని, విషమాగ్ని, సమాగ్ని, భస్మాగ్ని-అని అయిదు విధాలుగా అగ్ని ప్రకాశిస్తాడు. అగ్నియొక్క అవస్థలివి. మందంగా వుండే అగ్ని, తీక్ష్ణంగా ప్రకాశించే అగ్ని, విషమంగా వుండే అగ్ని, సమస్థితిలో వుండే అగ్ని, భస్మంచేసే అగ్ని-అని తీవ్రతాభేదాలననుసరించి అయిదు విధాలుగా అగ్ని ప్రకాశిస్తాడు.

**బడబాగ్ని:** ఇది సముద్రగతమైన అగ్ని.

**జఠరాగ్ని:** జీవుల గర్భంలో వుండే జీర్ణకారక అగ్ని.

**వజ్రాగ్ని:** వజ్రాయుధంలో వుండే పరాక్రమాగ్ని ఈ అగ్నిద్వారానే ఇంద్రుడు దానవుల్ని సంహరించాడు.

సూర్యాగ్ని: ఇది ఆదిత్యగతమైన ప్రకాశం. సర్వ జీవాధారమైనది. వర్ష కారకమైనది. కర్మప్రచోదకమైనది. సర్వప్రాణికోటికీ ఉపాస్యమైనది.

జ్ఞానాగ్ని: ఆత్మజ్ఞానం స్వయంప్రకాశ శీలమైనది. ఈ జ్ఞానాగ్ని సకల శుభాశుభకర్మలను భస్మం చేసేది. అదే మోక్షకారకం.

యస్య సర్వే సమారంభాః కామ సంకల్ప వర్జితాః।
జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణాం తమాహుః పండితం బుధాః॥

సంకల్ప కామాదులు లేకుండా, ఫలాపేక్ష లేకుండా, ఈశ్వరార్పణ బుద్ధితో చేసేకర్మ-జ్ఞానాగ్నిలో హుతమౌతుంది. అలా జ్ఞానాగ్ని ద్వారా దగ్ధమైన కర్మలు గలవాడు పండితుడు.

# వివిధ యజ్ఞాలు

'యజ్ఞం' అనే శబ్దం 'యజ్' అనే ధాతువునుండి వచ్చినది. దీనికి ఆరాధన, అర్చన వంటి అర్థాలు చెప్పవచ్చు.

ఈశ్వర ప్రీతికరంగా చేయబడ్డ స్వవిహిత కర్మ యజ్ఞమే.

భగవద్గీత 'జ్ఞానయోగం'లో శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన వివిధాగ్నుల (యజ్ఞాల) వివరాలు:

1. దేవతారాధన, దేవతోపాసన-ఇత్యాదిరూపమైన యజ్ఞం.

2. కొందరు 'బ్రహ్మాగ్ని' యందు యజ్ఞం చేస్తారు. అగ్ని సమస్తాన్నీ భక్షించి తనలో లీనం చేసుకుంటుంది. అదేవిధంగా 'సర్వం బ్రహ్మమయం' అనే స్థితి అగ్ని. అదే బ్రహ్మాగ్ని. ఆ బ్రహ్మాగ్నియందు సర్వం లయం చేసేవారు జ్ఞానయోగులు. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే భావనలో—
బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా॥

3. శ్రోత్రాది (చెవి మొదలైన) ఇంద్రియాలను 'సంయమాగ్ని' (నిగ్రహం అనే అగ్ని)లో హోమం చేస్తారు కొందరు.

4. శబ్దాది విషయాలను 'ఇంద్రియాగ్ను'ల్లో మరి కొందరు హోమం చేస్తారు. అంటే శబ్ద స్పర్శరూపరసగంధాత్మకమైన విషయాలను త్యాగం చేయడం.

5. ఇంద్రియ వ్యాపారాలను, ప్రాణాల వ్యాపారాన్ని జ్ఞానంతో ప్రకాశించే 'మనో నిగ్రహం' అనే అగ్ని ('ఆత్మ సంయమ యోగాగ్ని')లో హోమం చేస్తారు.

6. ద్రవ్యయజ్ఞం, తపోయజ్ఞం, యోగయజ్ఞం, స్వాధ్యాయ జ్ఞానయజ్ఞం-అని యజ్ఞ స్వరూపాలు.

ధన వస్తువులను సత్పాత్రులకు దానం చేయడం, సద్విషయాలకు వినియోగపరచడం ద్రవ్యయజ్ఞం. వ్రతోప

వాసాదులచేత శరీరాన్ని తపింపజేసి స్వాధీనపరచుకోవడం తపోయజ్ఞం. యమనియమాది అష్టాంగ విలసితమైన యోగం యోగయజ్ఞం.

వేదాధ్యయనం, శాస్త్రపఠనం, వాటి అనుష్ఠానం 'స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞం'.

7. ఇక ప్రాణాయామమూ యజ్ఞమే. ప్రాణాపాన గతుల్ని నిరోధించి, అపానవాయువులో ప్రాణవాయువును, ప్రాణవాయువులో అపానవాయువును హోమం చేస్తుంటారు కొందరు.

8. ఆహారంలో నియమాలు కలిగి, ప్రాణాదివాయువులను ప్రాణాదివాయువుల్లోనే హుతం చేస్తారు కొందరు.

—ఇలా ఇవన్నీ అగ్నిరూపాలుగా, యజ్ఞాలుగా 'భగవద్గీత' చెప్తోంది.

యజ్ఞం చేయగా మిగిలినది అమృతం. దానిని భుజించాలి. ఈశ్వరార్పణమైన కర్మ యజ్ఞం. ఈశ్వరునకు అర్పించిన దానిని స్వీకరించడమే అమృత భోజనం. అలా నివేదించకుండా స్వీకరించినవాడు దొంగే.

కనుక పై చెప్పిన యజ్ఞాలలో దేశకాల పాత్రలననుసరించి, ఏదైనా ఆచరించాలి.

యజ్ఞాలు పాపక్షయం చేస్తాయి.

అన్ని యజ్ఞాలలోకీ జ్ఞానయజ్ఞం శ్రేష్ఠమైనది. అన్ని కర్మలూ జ్ఞానం చేత పరిసమాప్తి చెందుతాయి.

# సౌరశక్తితో వంట

మహాశ్చర్యకరమైన విషయమేమిటంటే-మన దేశంలో అతి ప్రాచీనకాలంలోనే సౌరశక్తి(సోలార్ ఎనర్జీ)ని వినియోగించుకునేవారన్న విషయం. సూర్యకిరణాల వేడితో వంట వండే పద్ధతి మన పురాణాల్లో వర్ణించబడింది.

దివోదాసుడనే చక్రవర్తి రాజ్యపాలన చేస్తున్నప్పుడు, కాలవశాత్తూ, క్షేత్రాలలో దేవతలందరూ భూమిని విడిచిపెట్టారు. అప్పుడు దేవతల ప్రేరణవల్ల 'అగ్ని' కూడా ఆ రాజ్యాన్ని విడిచిపెట్టాడు. దాంతో ఆహారం పక్వం చేయడం వంటివి సాగలేదు. అంటే, పృథ్విలో ఇంధనగతంగా అగ్ని ఆవిష్కరింపబడలేదని భావం.

ఆ సమయంలో దివోదాసుడు సూర్యకిరణాల వేడితో వండిన వంటల్ని ఆరగించాడని వ్యాసప్రోక్త స్కాందపురాణంలోని 'కాశీఖండం'లో చెప్పబడింది.

'ఆరగించె దివోదాసు డర్కకిరణ
తాప పక్వంబులగు పదార్థంబు లెలమి'-

(కాశీఖండం-శ్రీనాథుడు)

కనుక ఈ సౌరశక్తి విజ్ఞానం మన దేశంలో ఏనాడో వుండేది. వైజ్ఞానికంగా సమగ్రంగా ఎదిగి, ఏనాడో సమున్నత శిఖరాలకు చేరుకున్న మన భారతజాతి, క్రమక్రమంగా వివిధ పరాయి దాడులవల్ల ఆ విజ్ఞాన సంపదని కోల్పోయింది.

ఇకనైనా మనం మేల్కొనాలి. మన జ్ఞాన విజ్ఞాన సంపదలైన వేదపురాణాది శాస్త్ర విషయాల్లో-నమ్మలేనివిగా కనబడినవాటి గురించి శాస్త్ర విశ్లేషణాత్మకంగా ఆలోచించాలి. మిగిలిన విజ్ఞానాన్నైనా సంరక్షించుకోవాలి.

# పంచాగ్నులు

'ఛాందోగ్యోపనిషత్తు'లో ప్రవాహణుడనే రాజర్షి, గౌతమ మహర్షికి 'అగ్నివిద్య'ను ఉపదేశించాడు.

1. 'అసౌ వా లోకో గౌతమాగ్నిః'

—'ఓ గౌతమ ఋషీ! ఈ లోకమే అగ్ని. ఇది సోమ కారకం'.

2. 'పర్జన్యో వా వ గౌతమాగ్నిః'

—ఓ గౌతమా! పర్జన్యుడే (లేక ఇంద్రుడే) అగ్ని. ఇది వర్ష కారకం'.

3. 'పృథివీ వా వ గౌతమాగ్నిః'

—'పృథివే అగ్ని. ఇందులో హవనమయ్యేది వర్షం. ఆ ఆహుతులచే అన్నం కలుగుతోంది'.

4. 'పురుషో వా వ గౌతమాగ్నిః'

—'ఓ గౌతమా! ఈ పురుషుడే అగ్ని. ఈ అగ్నిలో అన్నం హుతమై, ప్రజాకారక రేతస్సు పుడుతుంది'

5. 'యోషా వావ గౌతమాగ్నిః'

'ఓ గౌతమా! యువతే అగ్ని. ఈ అగ్నిలో ఇంద్రియాధి దేవతలచే హోమం చేయబడ్డ రేతస్సునుండి గర్భం కలుగుతోంది'.

ఇవీ పంచాగ్నులు. ఇలా విశ్వమంతా వున్నది అగ్నే. అవిచ్ఛిన్నంగా జరిగేది యజ్ఞమే.

పురుషుడు ఏ అగ్నినుండి వచ్చివున్నాడో, ఏ అగ్నుల చేత పుట్టివున్నాడో, ఆ అగ్నులే అతడిని తీసుకుపోతాయి.

జీవుడి రాకపోకలకి, ఊర్ధ్వలోక గతులకి కారణం అగ్నే.

## అన్నం తినడం యజ్ఞం చేయడమే

అహం వైశ్వానరో భూత్వా
ప్రాణినాం దేహమాశ్రితః।
ప్రాణాపాన సమాయుక్తః
పచామ్యన్నం చతుర్విధమ్॥

అన్నం-భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలని నాలుగు విధాలు. 'అగ్ని' ద్వారా పచనమయిన అన్నం (ఆహారం) ప్రాణుల దేహంలోకి వెళ్ళి, అక్కడ జఠరాగ్ని ద్వారా ప్రాణాపాన వాయువులతో కలిసి పచనమై, శరీరానికి శక్తి నిస్తుంది. "ఆ జఠరాగ్నిని నేనే" అని శ్రీకృష్ణపరమాత్మ వచనం.

ఆ విష్ణువే అగ్ని కదా. కనుక మనలో హోమ కుండం సిద్ధంగా వుంది. అగ్ని సిద్ధమైవుంది. అదే జఠరాగ్ని. అందులో మనం అన్నాలను హుతం చేస్తున్నాం. అలా హుతమైన దానిని స్వీకరించి, విభజించి, సారంగా, శక్తిగా మార్చి సర్వేంద్రియాలకు ఆ శక్తిని పంపుతున్నాడు జఠరాగ్నిరూప వైశ్వానరుడు.

యజ్ఞం జరిగేటప్పుడు అగ్నిలో హుతమైన దానిని దేవతలకు అగ్ని అందజేస్తాడు కదా. అలాగే ఇంద్రియాలకు ఈ అన్న శక్తిని అందజేస్తోంది జఠరాగ్ని. ఇంద్రియాలకు అధిష్ఠాన దేవతలున్నారని మరోసారి ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి.

కనుక అన్నం తినడం అంటే యజ్ఞం చేయడమే.

అయినా-అది యజ్ఞం ఎలా అవుతుంది? యజనం చేస్తే.అనగా ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తేనే యజ్ఞమవుతుంది. అంతేగానీ-కేవలం మనం తినడానికే అన్నం వండుకో కూడదు, యజ్ఞార్థం అన్నం వండాలి.

తే అఘం భుంజతే మూఢాః

యే పచంత్యాత్మ కారణాత్॥ (భగవద్గీత)

తనకోసం తాను వండుకొనేవాడు పాపాన్ని తినే మూర్ఖుడు. యజ్ఞార్థం వండి, యజ్ఞం చేశాక మిగిలిన దానిని తినేవాడు అమృతాన్ని ఆరగిస్తున్నట్టే. అలాంటి అన్నం అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది.

కనుకనే అన్నం తినేముందు ఈశ్వరస్మరణ చేయాలి అంటారు. అంటే ఈశ్వరార్పణ బుద్ధితో అన్నాన్ని తినాలి.

"జఠరాగ్ని స్వరూపుడైన (నారాయణునకు) విష్ణువునకు అన్నాన్ని సమర్పిస్తున్నాను. తద్వారా దేవతల తృప్తికి" అనే భావనతో అన్నం తినడం యజ్ఞమే. దానివల్ల ఇంద్రియాధిష్ఠాతలైన దేవతలు, అగ్నిరూపుడైన నారాయణుడు ప్రసన్నులై, ఆ దేహిని అనుగ్రహిస్తారు. వారి అనుగ్రహం కన్నా మించినది లేదు.

"నేను భుజిస్తున్నది బ్రహ్మమయమైన అన్నమే. అన్నం పరబ్రహ్మస్వరూపం కదా! భుజించే నేను (జీవుడు) బ్రహ్మమునే. నేను సమర్పించేదీ బ్రహ్మమునకే. ఇది బ్రహ్మకర్మ. దీనివల్ల లభించే ఫలం కూడా బ్రహ్మమే"-ఇదీ కావలసిన భావన.

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః
బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్।
బ్రహ్మైవ తేన గంతవ్యం
బ్రహ్మకర్మ సమాధినా॥—అని గీత.

ఆహార స్వీకారం యజ్ఞం కనుక-ద్విజుడు గాయత్రీ మంత్రపూతమైన ఆహారాన్ని-ప్రాణాయస్వాహా, అపానాయస్వాహా, వ్యానాయస్వాహా, ఉదానాయస్వాహా, సమానాయస్వాహా-అని అగ్ని (జఠరాగ్ని)కి సమర్పిస్తాడు. దేవతలకు ఆహుతులిచ్చేటప్పుడే స్వాహాకారం. ఇంద్రియాధిష్ఠాన దేవతలకు అన్నాన్ని ఇస్తున్నారు కనుక ఈ స్వాహోచ్చారణ.

ద్విజుడు తనకు విధించబడ్డ ధర్మంగా ఈ పరిషేచన చేస్తున్నాడు. కానీ అందరూ ఈ భావాన్ని గుర్తుపెట్టుకొని, "ఆ పరమేశ్వరునకు సమర్పిస్తున్నాను" అనే దృష్టితో, దైవ నామాన్ని భక్తితో స్మరించి అన్నాన్ని స్వీకరించాలి. అదే యజ్ఞం.

భగవద్భావనతో చేసే అన్నదానం 'యజ్ఞం' అనిపించుకునేది, ఈ కారణం చేతనే.

ఏ పూజా పునస్కారాలు చేయకపోయినా, అన్నం తినడం ఎవడూ మానడు గనుక, కనీసం అన్నం తినేముందైనా, 'అగ్నిరూపుడైన ఆ సర్వేశ్వరునకు సమర్పిస్తున్నాను' అని భక్తితో అన్నం తింటే అతడు 'యజమానే' (యజనము చేయువాడే)

యజ్ఞం శాస్త్ర సమ్మతం కావాలి. అశాస్త్రీయం కాకూడదు. కనుక అన్నాన్ని తినడం కూడా పశుప్రాయంగా కాక, సంస్కారబద్ధంగా వుండాలి.

ఈశ్వరునకు నివేదించనిది, పాచిపట్టినది, శుష్కమైనది, అక్రమార్జితమైనది, శుచిలేనిది-యజ్ఞనిషిద్ధం. అనగా నిషిద్ధాహారం.

వీటికి వ్యతిరేకమైన-ఈశ్వరనివేదిత, శుచియుక్త, న్యాయార్జిత సాత్విక మితాహారం యజ్ఞయోగ్య ద్రవ్యం. అదే స్వీకరించాల్సిన ఆహారం.

...'మే గోపాయ రసమన్న మిహాయుషే
అదబ్ధా యోऽశీతతనో
అవిషం నః పితుం కృణు'

"హే అశీతతనో! (వెచ్చని శరీరంగల అగ్నీ!) అన్నాన్నీ, రసాన్నీ-ఆయువు నిమిత్తం-నా శరీరంలో వుంచు. మా అన్నాన్ని రక్షించు. మా అన్నాన్ని విష శూన్యంగా చేయి" అని నీరాజన మంత్రం.

కనుక అగ్ని అన్నరక్షకుడు. అన్నాన్ని నిర్విషంగా, అమృతంగా మార్చే పరబ్రహ్మ.

అన్నాన్ని అనుసరించే బుద్ధి వుంటుంది. అన్నాన్ని ఈశ్వరార్పణంగా స్వీకరిస్తే, బుద్ధి శుద్ధమై సత్కర్మలకు ప్రేరే పించబడుతుంది. ఆయువు సార్థకమవుతుంది.

"శివ పార్వతులను (అగ్నీ సోమాత్మక పరబ్రహ్మాను) స్మరించకుండా తిన్న అన్నం విషసమానం. వారిని స్మరించి తినే అన్నం అమృతం"-అని పురాణోక్తం. ఆ శివదేవునే 'అన్నానాం పతయే నమః'అని స్తుతించింది 'రుద్రనమకం'.

వంట వండేటప్పుడే, (పొయ్యి ద్వారా) అగ్నిని ఎలాగూ వెలిగిస్తాం. ఆ అగ్నిని నమస్కరించి, 'పరమేశ్వరా! నీకు నివేదించడానికి వండుతున్నాము' అనే భావనతో వండడం, (అభీష్ట దైవానికి) ఈశ్వరునకు నివేదన చేయడం, ఈశ్వరార్పణతో ఆరగించడం-ఇది చాలు.

నిత్యం దీపారాధన, ఈ ఆహార యజ్ఞం-మనం చేయ గలిగే సులువైన మహోత్తమ ధర్మాలు. (దీపం లేనిదే నైవేద్యం పెట్టకూడదు)

అంతేగానీ యజ్ఞం పేరుతో, మనకేమాత్రం తెలియని అశాస్త్ర కర్మల జోలికి పోకూడదు. శాస్త్రవిరుద్ధాన్ని భగవంతుడు క్షమించడు. 'యజ్ఞం' అని పేరుపెట్టి, విధిపూర్వకంగాకాక, అశాస్త్రీయంగా ఆచరిస్తే, అలా ఆచరించే వారు నీచయోనుల్లో జన్మించి, ఇంకా అధోగతిపాలవుతారనీ, ఏనాటికీ ఉత్తమగతిని పొందలేరనీ 'గీత'లో స్పష్టంగా చెప్పబడింది.

ఆత్మసంభావితా స్తబ్ధా ధన మాన మదాన్వితాః।
యజంతే నామ యజ్ఞైస్తే దమ్భేనాఽవిధిపూర్వకమ్॥

తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్
క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు॥

ఆసురీం యోనిమాపన్నాః మూఢా జన్మని జన్మని।
మామప్రాప్యైవ కౌన్తేయ! తతో యాన్త్యధమాం గతిమ్॥

యజ్ఞం చేస్తున్నామని చెప్పి, డబ్బు వసూలు చేసి, శుచి మొదలైనవి లేకుండా, అందరిచేతా అన్ని పరిస్థితుల్లోనూ నేతిని అగ్నిలో వేయించే దుస్సాహసాలు కొందరు చేస్తుంటారు. ఆ యజ్ఞాలు కల్పోక్తాలూ కావు. శాస్త్రోక్తాలూ కావు. స్వబుద్ధిరచిత శాస్త్రాలు పనికిరావు.

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్య వ్యవస్థితౌ।
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మకర్తు మిహార్హసి॥

శాస్త్రాన్నే ప్రమాణంగా తీసుకోవాలి. శాస్త్రవిధిని తెలిసికొని కర్మచేయాలి.

యచ్ఛాస్త్ర విధిముత్సృజ్య వర్తతే కామకారతః।
న చ సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాం గతిమ్॥

శాస్త్ర విధిని విడిచిపెట్టి, ఇష్టానుసారం ప్రవర్తించే వాడు సిద్ధిని పొందడు. అతడికి ఇహపరాలుండవు,

కనుక అటువంటి విషయాల జోలికి వెళ్ళవద్దు. అగ్ని పవిత్రమే అయినా, ఒళ్ళో పెట్టుకోలేం కదా. దాని పరిమితి దానికి వుంది. ఆ పరిమితుల్లో వున్నప్పుడు మనకు అది రక్ష. ఇంట్లో ప్రమిదలో వున్న అగ్ని వెలుగునిస్తుంది. పొయ్యిలో వున్న అగ్ని పచనం చేస్తుంది. కానీ ఆ అగ్నినే ఇంటిమీద పెడితే బూడిదని మిగుల్చుతుంది. దేని మర్యాద దానిదే.

కనుక శాస్త్రసమ్మతమైన ప్రవర్తనకే, ఆ అగ్నిభగవానుడు కరుణిస్తాడు. ఏదో పుణ్యం వస్తుందనే భ్రమతో, అశాస్త్ర కర్మ చేస్తే అది పతనం చేస్తుంది.

అశాస్త్రీయమైన యజ్ఞాలు (కృత్యాలు) పంచభూతాల్ని క్షోభింపజేస్తాయి. వాటి ప్రకోపంతో అతివృష్టి, అనావృష్టి, అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి. శాస్త్రీయమైన యజ్ఞం శాంతినిస్తుందన్నట్లే, అశాస్త్రీయం అశాంతినిస్తుంది.

మనం భక్తితో భగవంతుని నమస్కరించి, ఇట్లో దేవుని ముందు శుచిగా దీపం వెలిగించి, నైవేద్యం పెట్టి నీరాజనాన్ని స్తే-ఆ తరువాత పై చెప్పిన విధంగా అన్నాన్ని ఆరగిస్తే-అది చాలు, మనల్ని తరింపజేస్తుంది.

దేవయజ్ఞం, ఋషియజ్ఞం, పితృయజ్ఞం, మనుష్య యజ్ఞం, భూతయజ్ఞం-చేసి అన్నాన్ని ఆరగించాలి.

నిత్యం చేసే దేవపూజ, పర్వదినాలలో ఉద్దేశింపబడ్డ దేవతార్చన-మొదలైన వాటిద్వారా 'దేవయజ్ఞం' నెరవేర్చినట్టే. వేదాధ్యయనం, సద్గ్రంథ పఠనం, వాటియందు పేర్కొన్న ప్రకారంగా స్వధర్మ నిర్వహణ చేస్తే 'ఋషి యజ్ఞం'.

తల్లిదండ్రుల్ని, వారు బ్రతికుండగా సేవించడం, మృతులయ్యాక తర్పణాదుల ద్వారా తృప్తిపరచడం 'పితృ యజ్ఞం'. అతిథిపూజ, దానధర్మాదులు 'మనుష్య యజ్ఞం'. ప్రాణికోటికి ఆహారాన్నివ్వడం-'భూతయజ్ఞం'. ఈ యాజ్ఞాలు చేసేవాడుతినే అన్నం అమృతమే.

## అగ్ని ఐశ్వర్య కారకుడు

అగ్నినా రయిమశ్నవత్
పోషమేవ దివే దివే
యశసం వీరవత్తమమ్...
-అని ఋగ్వేదంలోని అగ్నిసూక్తం.

అగ్ని చేత, రయిమ్-సంపదను, పొందుతున్నాం. ప్రతి దినం పోషణ, యశస్సు, ఉత్తమమైన సామర్థ్యం అగ్ని ప్రసాదాలే.

సంపద-అంటే పోషించేది, కీర్తినిచ్చేది, సామర్థ్యాన్ని కలిగించేది.

అంటే-సంపదకి అర్థం డబ్బుమాత్రమే కాదు.

"ధనమగ్నిర్ధనంవాయుః, ధనం సూర్యో, ధనం వసుః" అని శ్రీ సూక్తంలో చెప్పబడింది.

ఆహారం, గాలి, నీరు, సూర్యుడు-ఇవి ప్రకృతిలో లభించేవి. మనకి జీవాధారమైనవి. ఈ సంపదే పోషణాత్మకమైనది. వీటినుండి లభించే పదార్థాలతోనే పోషించబడుతున్నాం.

ప్రకృతివల్ల లభించే పదార్థాలు సమృద్ధిగా సంపాదించి, తద్వారా పోషించబడి, యశస్సుపొంది, ఉత్తమ సామర్థ్యంతో జీవించేవాడే ఐశ్వర్యవంతుడు.

అలా ఐశ్వర్యవంతుల్ని చేసేది విశ్వవ్యాప్తమైన అగ్నే.

వాయుజలాదులు మనకు అయాచితంగా లభించిన ఈశ్వర కృప. అందుకు కృతజ్ఞతను వ్యక్తం చేయడమే ఆరాధన. ఆ ఆరాధనా భావన మన చైతన్యాన్ని, ఈశ్వరునితో అనుసంధానం చేస్తుంది. తద్వారా ఈశ్వరచైతన్యంతో మన జన్మ ధన్యమవుతుంది.

భూగతమై, దహన ప్రక్రియ ద్వారా-ఖనిజాలను, సువర్ణాది లోహాలను, రత్నాలను తయారుచేసేది అగ్నే. మళ్ళీ వాటిని కరగింపజేసి సంపదగా మార్చేదీ అగ్నే. కనుకనే 'అగ్ని'ని 'హిరణ్యం' అంటారు. ఇదే సువర్ణం.

హితం, రమ్యం-కలగజేసేది 'హిరమ్యం'. అగ్నిశుద్ధమైన సువర్ణం 'హిరమ్య'మే. 'పరోక్షప్రియ ఇవ దేవాః'- అనే సూత్రానుసారం-హిరమ్యం 'హిరణ్యం' అయ్యింది.

అభిభ్ర దగ్న ఆగహి
శ్రియా మా పరిపాతయ॥ (నీరాజన మంత్రం)

ఓ అగ్నీ! మమ్మనుగ్రహించడానికై వచ్చి, ధనధాన్యాది సంపదతో అనుగ్రహించమని ఈ మంత్రభావం.

సమ్రాజం చ విరాజం చాభి శ్రీర్యాచనో గృహే।
లక్ష్మీ రాష్ట్రస్య యాముఖే। తయామాసగ్ం
సృజామసి॥ (నీరాజన మంత్రం)

రాజ్య సంపదగా, గృహ సంపదగా వుండే అగ్ని, ఆ సంపదచేత మనల్ని ప్రకాశింపజేయాలని ఈ మంత్రభావం.

వసురగ్నిః-అని స్మార్తాగ్ని మంత్రంలో చెప్పబడింది. 'వసు' అంటే సంపద.

సంపదే అగ్ని స్వరూపమని, అగ్ని సంపత్కారకుడని వేదశాస్త్రాలు ఈ విధంగా స్పష్టీకరిస్తున్నాయి.

Sanare

'త్వాం మమావహ జాతవేదో లక్ష్మీ మనపగామినీం'
(శ్రీసూక్తం)

జాతవేదుడే (అగ్ని) లక్ష్మిని ఆవహింపజేసేవాడు. శ్రీసూక్తానికి మరో పేరు 'అగ్ని శ్రీసూక్తమ్'. అగ్నియందు లక్ష్మిని దర్శించి ఋషులు పలికిన అపౌరుషేయ వాక్కులే శ్రీసూక్తం.

అక్షరాలలో అగ్నిబీజాలు-ఇ, ఈ, గ, ఖ, ఛ, ఠ, ఢ, ఫ, ర, స. ఇందులో 'ర' ముఖ్యబీజం.

'శ్రీ' అనే మహాక్షరంలో-శ+ఈ+ర-అనే మూడు అక్షరాలున్నాయి.

శ-లక్ష్మీ వాచకం, ఈ-ఈశ్వరవాచకం, ర-అగ్నిబీజం. అగ్నిమయులైన పరాశక్తి పరమేశ్వరులను తెలియజేసేది-'శ్రీ'. అగ్నిబీజం వుండడం చేత, ఈ అక్షరం ఐశ్వర్య కారకమై, మహాలక్ష్మీ వాచకమయ్యింది.

"ఐశ్వర్యం విద్ధుతాశనాత్"-అని ఆర్షవచనం. హుతాశనుని ద్వారా ఐశ్వర్యం లభిస్తుంది.

## దీపారాధన

తంత్రశాస్త్రంలో కూడా 'అగ్ని' ఆరాధన విశిష్టత సంతరించుకుంది. హోమాన్ని ప్రజ్వలింపజేసి, ఆ హోమాగ్నిలో ఆహుతులివ్వడం ఆచారం.

Sanare

ఉపనయన వివాహాది కర్మలలో, పితృకర్మలలో అగ్ని హోత్రాన్ని ఆరాధించడం వున్నదే. అగ్ని ఆరాధన లేకుండా ఏ కర్మా చేయరాదు.

కనుకనే ఇంట్లో దీపారాధన చేయడం. దీపారాధన అగ్ని ఆరాధనే. అర్చనాది కర్మలు దీపారాధనతోనే ప్రారంభిస్తారు.

నిత్యం అగ్నిహోత్రాన్ని ప్రజ్వలింపజేయడానికి తగదు. ఆయా విధివిధానాలను, నియమాదులను అనుసరించి హోమాగ్నిని ప్రతిష్ఠిస్తాం.

పూర్వం విప్రగృహాల్లో నిత్యాగ్ని హోత్రాలుండేవి. భక్తితో, శాస్త్రవిధిని అనుసరించి సాగేది ఆ అర్చన.

అయితే దేశకాల పరిస్థితులబట్టి ఆ అగ్నిహోత్రార్చన ఈ రోజుల్లో దాదాపు అసాధ్యమైన పని. కనుకనే పరిషేచన మంత్రాలతో జఠరాగ్నికి అన్నాన్ని సమర్పించడం ఇంకా ముఖ్యమయ్యింది. (ఇప్పటికీ శాస్త్రానుగుణంగా నిత్యాగ్నిహోత్ర కర్మలు చేసే మహానుభావులు ఎక్కడైనా వుండవచ్చేమో. కానీ ఆ సంఖ్య బహుళం కాదు)

ఈ రోజుల్లో అగ్నిహోత్ర కర్మ చేసేందుకు శాస్త్రానుగుణ పరిస్థితులు లేవుగనుక, అగ్నిహోత్రారాధన మరుగయ్యింది. అగ్నిహోత్రాన్ని ఎలాగూ అశాస్త్రీయంగా ఆరాధించరాదు. కనుక దీపారాధనే అగ్ని ఆరాధనగా భావించాలి. రెండు సంధ్యలలో దీపం వెలిగించడం ప్రధానం. ఇంటికి దీపం ఐశ్వర్య కారకం.

మూడు వత్తులూ ఒక వత్తిగా చేసి-ఆవు నేయి, లేదా నువ్వుల నూనెతో ఉభయ సంధ్యలు దీపం వెలిగించాలి. వెంటనే దైవానికి నైవేద్యం పెట్టాలి. ధూపం, దీపం, నీరాజనం-అగ్ని కుసుమాలు.

'దీపలక్ష్మి' అంటారు పెద్దలు. అగ్ని ఐశ్వర్య కారకుడు కనుకనే దీపం లక్ష్మీరూపంగా చెప్పబడుతోంది.

కనుక-'వందే క్షీర సముద్రరాజతనయాం'-అనే లక్ష్మి స్తుతి శ్లోకంలో "లోకైక దీపాంకురాం" అని లక్ష్మిదేవిని స్తోత్రించారు. ఆ తల్లి లోకానికంతటికీ వెలుగునిచ్చే 'దీపపు మొలక'. కనుక దీపమే లక్ష్మి.

"త్రాహిమాం నరకాత్ ఘోరాత్
దివ్యజ్యోతిర్నమోస్తుతే..." అని భక్తితో దీపం వెలిగిస్తారు. సంధ్యలలో దీపం వెలిగించని ఇల్లు ఇల్లుకాదు. అదే అగ్ని ఆరాధన. అదే లక్ష్మిప్రదం.

జ్యోతిస్వరూపుడైన పరబ్రహ్మమే దీపజ్యోతి. దీపం వెలిగించి, నైవేద్యం సమర్పించడం నిత్యయజ్ఞమే.

"ఆవు నేతితో వెలిగించిన దీపంలో మంగళగౌరీదేవి వుంటుంది" అని పురాణ వచనం.

'సర్వ మంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే।
శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోస్తుతే'-అని కీర్తించబడ్డ సర్వమంగళ శ్రీమాతకి ప్రతిరూపమే ఈ జ్యోతి. ముగురమ్మల మూలపుటమ్మ రూపమే ఈ దీపశిఖ.

Sanaare

ఆ ముగురమ్మల తత్త్వం తెలియజేస్తూ దీపశిఖలో ప్రధానంగా మూడు భాగాలు కనబడతాయి.

మొదటిది-నీలం. ఇది శ్యామలాంబిక దుర్గను తెలియ జేసేది.

రెండవది- తెలుపు కలిసిన పసుపు వర్ణం. ఇది సర స్వతికి ప్రతీక.

మూడవది-ఎరుపు కలిసిన పరుపువర్ణం-ఇది మహాలక్ష్మి రూపం.

కనుక దీపం ముగురమ్మల రూపం. అంతేకాదు ముగు రయ్యల రూపమూను. గౌరీ సోదరుడు విష్ణువు నీలభాగానికి, సరస్వతీ సోదరుడు శివుడు మధ్యభాగానికీ, లక్ష్మీ సోదరుడు బ్రహ్మ అగ్రభాగానికీ ప్రతీకలు.

బ్రహ్మ విష్ణు శివాత్మకమైనదే పరబ్రహ్మ. ఈ భావ నతో దీపశిఖని దర్శించి నమస్కరించాలి. అది సర్వదేవతా రాధనే.

బ్రహ్మాండం నుంచి- మొత్తం ఆరుగురు సాక్షాత్కరిం చారని పురాణాలు చెప్తాయి. శివ సరస్వతులు, లక్ష్మీ బ్రహ్మలు, గౌరీ విష్ణులు -అని. సోదరీ సోదరులుగా వీరిని పేర్కొనవచ్చు.

అంతేకాకుండా-ఈ దీప శిఖ త్రిగుణాలకీ, త్రిలోకా లకీ ప్రతీక.

భూః—భూలోకం
భువః—భువర్లోకం
సువః—సువర్లోకం.

-ఇవి త్రిలోకాలు. ఈ త్రిలోకాలే దీపశిఖలో మూడు భాగాలు.

భూర్భువ స్సువర్లోకాలలో వ్యాపించిన, సూర్యతేజో సంబంధమైన శ్రేష్ఠమైన త్రిమూర్త్యాత్మక శక్తి 'గాయత్రి'. ఆతల్లి మనబుద్ధుల్ని ప్రేరేపించేతల్లి. కనుక దీపశిఖే గాయత్రి.

సర్వదేవతాత్మకమైన జ్యోతిర్మయ శివలింగరూపంగా దీపశిఖని భావించాలి.

ఈ బ్రహ్మాండంలో ప్రత్యణువులోనూ బ్రహ్మాండం వుంది. బయట ఎంత బ్రహ్మాండం వుందో, అణువులోనూ అంత బ్రహ్మాండం వుంది. దానిని దర్శించగలగాలి. అదే అద్వైతస్థితి. ఆ దర్శనానికి దీపారాధన ఓ మార్గం.

అంతేకాక-ఈ దీపశిఖలోని మూడు భాగాలు స్థూల (పసుపు+ఎరుపు వర్ణం), సూక్ష్మ (తెలుపు+పసుపు), కారణ (నీలవర్ణం) శరీరాలకి ప్రతీకలని శ్రీ రామకృష్ణ పరమ హంస వివరించారు.

దీపశిఖను చూస్తూ ధ్యానం చేయడం అత్యుత్తమ సాధనమని పరమహంస వచనం.

కార్తీక పురాణంలో దీపార్చన, దీపదానంవంటి దీపా రాధనల మహిమలు వర్ణించబడ్డాయి. ఈ మహిమలు అనేక

పురాణాల్లో కూడా చెప్పబడ్డాయి. అఖండ దీపారాధన, నిత్య దీపారాధన-వంటి వాటి గురించి మనం వినే వుంటాం. ఈ విధంగా దీపారాధన ఎన్నో శుభఫలాలనిచ్చే సత్కర్మ. పద్మంలాంటి హృదయపు ప్రమిదలో వెలిగే శాశ్వత దీప జ్యోతి పరబ్రహ్మ. మన భ్రూమధ్యంలో అగ్ని లింగాకృతిలో వెలిగే పరమాత్మకి ప్రతీకే దీపశిఖ.

అతడు నిరాకారుడు, సాకారుడు కూడా. ఆ బిందు రూపుడే అనేక దేవతాకృతులు ధరించాడు.

అగ్నిరూపాలు ఒక్కొక్క ఋషికి ఒక్కోలా గోచరించాయి. అవి అగ్నియొక్క విభిన్న తత్వాలననుసరించి వుండే రూపాలు. చేసే కర్మబట్టీ, ఫలంబట్టీ ఒక్కొక్కరూపం చెప్పబడుతుంది.

త్రిణయన మరుణాప్తాబద్ధ మౌళిం సుశుక్లాం
శుకమరుణ మనేకా కల్పమంభోజ సంస్థమ్।
అభిమత వరశక్తిం స్వస్తికాభీతి హస్తం
నమత కనక మాలాలంకృతం సంకృశానుం॥

త్రినేత్రాలతో, జటాధారియై, పద్మాసనుడై-వరద, శక్తి, స్వస్తిక, అభయ హస్తాలతో-సువర్ణమాలాలంకృతుడై వుండే అగ్నిమూర్తిని ఒక హోమ ప్రక్రియలో ధ్యానిస్తారు.

అగ్ని ఒక్కడే. కానీ కర్మలు అనేకం. అలాగే అగ్ని అనేక రూపాలు. అనేక శక్తులు.

మన పనులబట్టి తగిన ఫలాన్నివ్వడం పరమేశ్వరుడైన అగ్ని లక్షణం. కర్మఫల ప్రదాత, కర్మసాక్షి ఆయనే. రక్షారూపుడై కరుణించేవాడు అగ్ని. శిక్షారూపుడై ధర్మ స్థాపన చేసేవాడు అగ్ని.

అగ్నిలో ఏ చిన్న రవ్వని తీసుకొని ఏ వస్తువుపై వేసినా వెంటనే అక్కడా ఒక మహాగ్ని ప్రజ్వరిల్లుతుంది. ఇంధనాధారంగా, గుణాధారంగా అగ్ని పలు ఆకృతులు, వర్ణాలు ధరిస్తుంది. ఆ ఆకృతుల నిండా, వర్ణాలనిండా వున్నది ఆ తేజో తత్వమే. అదే విధంగా భక్తుల ఉపాసనకై ఆ పరమాత్మ అనేక దివ్యాకృతులు ధరించాడు. ఆ ఆకృతుల ఆరాధన ఆ పరమాత్ముని ఆరాధనే.

ఆ అగ్నికాంతి జ్వాలా మాలాకులం. అదే హృదయ పద్మవ్యాప్తమైన చిదాకాశం.

...జ్వాల మాలాకులం భాతి విశ్వ స్యాయతనం
మహత్।
సంతతగ్ం శిలాభిస్తులం బత్యాకోశ సన్నిభం
తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మం తస్మింత్సర్వం
ప్రతిష్ఠితం॥
తస్య మధ్యే మహానగ్నిర్విశ్వార్చిర్విశ్వతో ముఖః
సోగ్ర భుగ్వి భజ న్తిష్ఠన్నాహార మజరః కవిః॥
తిర్యగూర్ధ్వమధశ్శాయీ రశ్మయ స్తస్య సంతతా

సంతాపయతి స్వందేహ మాపాదతలమ స్తకః
తస్య మధ్యే వహ్ని శిఖా అణీయోర్ధ్వావ్యవస్థితా...

హృదయం విశ్వానికే ఆయతనం (స్థానం). అది కాంతిపూరితమై ప్రకాశిస్తోంది. తామరమొగ్గతో సమానమైన హృదయ కమలం (నాభిమీదుగా) శరీర మధ్యమందు అధోముఖంగా వ్రేలుతోంది. దానినుండి నాడులు శరీరమంతా వ్యాపించి వున్నాయి. దాని సమీపంలో సూక్ష్మరూపనాడి (సుషుమ్న) అనే నాళం వుంది. ఆ నాళంలో సర్వమూ వున్నది.

ఆ నాళ మధ్యాన మహాగ్ని వుంది. అది గాఢమైన అగ్ని. బహుజ్వాలలు గలది. ఇదే నాడులకు చైతన్యాన్నిచ్చేది. ఇదే మొదటి భోక్త. ఇదే ఆహారాన్ని విభజించి ఆ అన్నరసాన్ని జీర్ణింపజేసే నేర్పుకలది.

ఆ అగ్నిరశ్ములు ఎల్లప్పుడూ, అడ్డుగా, మీదుగా, కిందుగా ప్రసరిస్తూ, ఆపాదమస్తకం దేహాన్ని ప్రకాశింపజేస్తాయి. ఈ జఠరాగ్ని మధ్యలోని అగ్నిజ్వాల అణువువలె చిన్నదై ఊర్ధ్వంగా బ్రహ్మరంధ్ర పర్యంతం ప్రసరిస్తుంది.

నీల తోయదమధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా
నీవార శూకవత్తన్వీ పీతా భాస్వత్యణూపమా
తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మావ్యవస్థితః
సబ్రహ్మా సశివ సహరి స్సేంద్ర స్సోక్షరః పరమః స్వరాట్।

వర్షాకాల మేఘమధ్యంలో మెరిసే మెరుపు తీగలా, ఆ అగ్నిశిఖ నివ్వరి ధాన్యపు మొనవలె సూక్ష్మమై ప్రకాశిస్తోంది. ఆ శిఖమధ్యలో పరమాత్మ వున్నాడు. అతడే బ్రహ్మ. అతడే విష్ణువు. అతడే ఇంద్రుడు. అతడే అక్షరుడు. అతడే స్వరాట్-విశుద్ధ బ్రహ్మం.

అతడి ప్రకాశమే ఈ అగ్ని అంతా. ఇలా శరీర గతమై వున్నాడుఅగ్ని. ఈ మంత్రపుప్రభావం అణువిజ్ఞానం.

మన శరీరంలో అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ. ఆనందమయ కోశాలలో అగ్ని ప్రకాశిస్తున్నాడు. అతడే ఆకలిగా, బలంగా, శక్తిగా వున్నాడు.

ప్రాణమయమైన ఆ సూక్ష్మజ్యోతివల్లనే ఆలోచనలు, స్మృతి, అవగాహన, గ్రహణశక్తి కలుగుతున్నాయి. ఇవి చైతన్య ధర్మాలు. చైతన్యం అగ్నిధర్మం.

ప్రపంచం కాంతివల్లనే కనిపిస్తుంది. కాంతి అగ్ని లక్షణం. దానిని గోచరింపజేసుకొనే కాంతి కంటికుండాలి. అదే చూపు. కనుక కంటి చూపు అగ్నే. అదే సూర్యాధిదేవతగాగల అగ్ని. సూర్యాగ్ని.

మనయందు 'ప్రజ్ఞా'రూపం అగ్ని.

ఒక వ్యక్తి మనకు గోచరమవుతాడు. కానీ అతడిలోని 'ప్రజ్ఞ' మనకి గోచరం కాదు. అప్పుడే పుట్టిన శిశువు

నాలుకకి తేనె తగిలిస్తే, వెంటనే చప్పరిస్తాడు. ఇలా ప్రతి ఇంద్రియంలో 'ప్రజ్ఞ' రూపంగా వుండేది అగ్నే. ఇలా శరీరంలో ప్రజ్ఞను గోపనం చేసేవాడు-అగ్ని.

ఋతాన్ని గోపనం చేసేవాడు- (అనగా ఋతాన్ని 'రక్షించేవాడు' అని కూడా అర్థం) అగ్ని.

గోపామృతస్య దీదివమ్-(అగ్నిసూక్తం)

సృష్టికి ముందున్నవి శాశ్వత సత్యాలు. అవి సృష్టిలో ప్రవర్తించేటప్పుడు వాటికి పేరు 'ఋతం'. ఆ సత్యాలు గోపనీయం కావాలి. రక్షింపబడాలి. అలా గోపనం చేయడం, రక్షించడం అగ్నిధర్మం.

ఈ విధంగా సత్యాన్ని సృష్టిప్రవర్తకంగా నిర్వహించుతున్నందుకు-అనగా ఋతమును యజ్ఞంగా నిర్వహించుతున్నందుకు-అగ్నిని 'ఋత్విజుడు' అన్నారు.

## శుచి-పావకుడు-పవమానుడు

అగ్ని-శుచి, పావకుడు, పవమానుడు-అనే పేర్లతో కూడా ప్రస్తుతించబడుతున్నాడు.

'శుచి' అనే అగ్ని శరీరాన్ని బహిరంతరాల్లో నిర్మలంగా వుంచుతాడు. ఆ కారణం చేతనే శరీరం కుళ్ళకుండా, రోగగ్రస్తం కాకుండా వుంటోంది. 'పావకుడు' మనం తిన్న

ఆహారాన్ని జీర్ణంచేసే జఠరాగ్ని. 'పవమానుడు' ఉచ్ఛ్వాస నిశ్వాసలు నిర్వహించే అగ్ని. ఆ అగ్ని కారణంగా అన్న సారమైన శక్తి అన్ని అవయవాలకు అందజేయబడుతుంది. రక్త ప్రసరణ జరుగుతుంది. ఈ విధంగా ఒకే అగ్ని మూడు క్రియలకై మూడు అగ్నులుగా ప్రకాశిస్తోంది.

## అగ్నిః ప్రథమః

ఏ దేవతనైనా అగ్నిలోనే దర్శించారు ఋషులు. అగ్నిలోనే ఈశ్వరుడు సాక్షాత్కరించాడు.

'అగ్నిః ప్రథమః' అంటోంది వేదం. అందుకే పూజారంభంలో దీపాన్ని వెలిగించడం. ప్రథమంగా అగ్నిని ఆవిష్కరించాకే యజ్ఞ నిర్వహణ.

వేదాలలో ప్రథమం ఋగ్వేదం. దానిలో ప్రథమ మండలంలోని ప్రథమ సూక్తం అగ్ని సూక్తమ్. అనగా ప్రథమంగా పరబ్రహ్మస్వరూపుడైన అగ్నినే ఋషులు దర్శించి, 'అగ్రస్వరూపుడి'గా కీర్తించారు.

ఆ ప్రథమ స్వరూపుని ఆరాధించడం అనే సంస్కారం వల్ల మనం తరిస్తాం. ఈ అగ్న్యారాధన సర్వకాలాలలోనూ, సర్వదేశాలలోనూ వుంది. చాలామంది తెలియకుండాకూడా అగ్నిని ఆరాధిస్తున్నారు.

దీపమో, కొవ్వొత్తో, అగరొత్తో-వారి వారి మత ధర్మప్రకారంగా, వెలిగించనివాళ్ళు లేరు.

భగవంతుడు జ్యోతిఃస్వరూపుడు, స్వయంప్రకాశకుడు, చైతన్యమయుడు, జ్ఞాన స్వరూపుడు, అనంతుడు, ఆది-అని అన్ని మతాలవారూ అంగీకరిస్తారు. ఆ లక్షణాలు అగ్నిలక్షణాలే కదా! కనుక విశ్వారాధ్యుడు అగ్ని.

అంతరిక్షం అగ్నిమయం. జ్యోతిర్మండలాలు, నక్షత్ర మండలాలు కాంతి స్వరూపాలే. ఉష్ణగోళాలే. కనుక అవి అగ్నిరూపాలే. అగ్నినుండే శక్తి కలుగుతుంది.

## సర్వదేవతా స్వరూపుడు

తపస్వులు, భక్తులు తీవ్రసాధనతో తమ అభీష్టదైవాన్ని ఉపాసించినప్పుడు, ముందు ఒక నిరాకార దివ్యకాంతి సాక్షాత్కరించి, ఆకాంతే తమ ధ్యేయమూర్తిగా ప్రత్యక్షమయ్యిందని వేదపురాణాలు వర్ణించాయి. నిరాకారుడూ, సాకారుడూ అయిన జ్యోతిర్మయుడు బ్రహ్మము అని దాని అంతరార్థం.

దుష్ట రాక్షస విజృంభణ సమయంలో దేవతలంతా ధర్మస్థాపనార్థం యజ్ఞం నిర్వహించినప్పుడు, ఆ అగ్ని నుండి

ఒక మహా కాంతిపుంజం ఆవిర్భవించింది. అది దేవతల యొక్క ప్రకాశ, పరాక్రమాల పుంజమే. ఆ అగ్ని దుర్గగా (పరాశక్తిగా) సాక్షాత్కరించిందనీ, ఆ అగ్ని తన విశ్వ రూపాన్ని ప్రదర్శించిందనీ, వివిధ రూపాలు ధరించి ధర్మ స్థాపన చేసిందనీ దేవీభాగవత కథనం.

అమ్మవారిని "చిదగ్నికుండసంభూతా" అన్నారు. జ్ఞానాగ్ని కుండంలో ప్రభవించే సచ్చిదానంద పరబ్రహ్మ తేజమే ఆ పరాశక్తి. ఆ తల్లే శ్రీమాత, శ్రీమహారాజ్ఞి, శ్రీమత్సింహాసనేశ్వరి. దేవకార్యార్థమై చిదగ్నికుండంలో ఆవిర్భవించింది.

పరాశక్తి దివ్య మాతృమూర్తిగా కనబడినప్పుడు-

తామగ్ని వర్ణాం తపసా జ్వలంతీం
వైరోచనీం కర్మఫలేషు జుష్టాం
దుర్గాం దేవీం శరణమహంప్రపద్యే॥

అని అన్నాయి వేదాలు.

ఆ తల్లి దుర్గ అగ్నివర్ణ. తపస్సుతో జ్వలించేది. కర్మఫలదాయిని. ఆ అగ్నే దుర్గ అని చెప్పే తత్త్వమిది.

కనుకనే దుర్గాసూక్తంలో "జాతవేదసే సునవా మసోమమరాతి యతోనిదహాతి వేదః. సనః పరుషదతి దుర్గాణి...," అని చెప్పబడింది.

జాతవేదుడంటే అగ్ని. ఆ అగ్నియందే దుర్గని దర్శించి స్తోత్రించారు. శ్రీసూక్తంకూడా ఈ విషయమే స్పష్టం చేస్తోంది.

'ఓ జాతవేదా! పరమపురుషునకు అనపగామిని అయిన లక్ష్మిని ఆవహింపజేయి' అని శ్రీసూక్తం.

దేవతలు అగ్ని శరీరులు. వారిని అగ్నిమాధ్యమంగానే స్తోత్రించాలి. తత్త్వతః ఆలోచిస్తూ వెళితే...స్తోత్రం (వాక్కు) అగ్ని. స్తోత్రించే ప్రజ్ఞాస్వరూపుడు అగ్ని. స్తోత్రించబడే బ్రహ్మము అగ్ని. ఈ త్రిపుటి సమైక్యమే గమ్యం. ఇదే అద్వైతం.

పరమేశ్వరుడు 'అగ్నిలింగం'గా వ్యక్తమయ్యాడని శివపురాణాదులు చెప్తున్నాయి. అగ్ని ఈశ్వరరూపుడుకదా, ఆనాటినుండే లింగారాధన వ్యాప్తిచెందింది. జ్యోతిర్మయ పరమేశ్వరుని నిరాకార తత్త్వానికి ప్రతీక లింగం.

విరాట్పురుషుని మహః దివ్యప్రకాశాన్ని 'విరాడగ్ని' అన్నారు. విశ్వం జడీభూతం కాకుండా చైతన్యమయం కావడానికి ఈ విరాడగ్ని కారణం.

గాయత్రీ మంత్రానికి సూర్యుడు (సవిత) దేవత. అనగా అగ్నే. అందుకే 'అగ్నిర్దేవతా' అన్నారు. దేవతలు అగ్నిముఖులు కనుకనే గాయత్రీదేవిని 'అగ్నిర్ముఖం' అన్నారు.

(9)

శ్రీ నృసింహస్వామి దుర్నిరీక్ష్య ప్రకాశంతో ఆవిర్భవించినప్పుడు-ఆ స్వామి ముఖంనుండి వచ్చిన అగ్ని జ్వాలలతో దిక్కులు ప్రకాశమానమయ్యాయి. ఆయన దంష్ట్రల ధగధగలకి హిరణ్యకశిపుని కళ్ళు చీకట్లు కమ్ముకున్నాయి.

పంచాననోద్ధూత పావక జ్వాలలు
ఘనభోంతరమెల్ల ఘూరితముగ
దంష్ట్రాంకురాఖిల ధగధగాయిత దీప్తి
అసురేంద్రు నేత్రంబులంధములుగ....

అని నృసింహుని వర్ణన.

ఇక – శ్రీకృష్ణపరమాత్మ అర్జునునకు విశ్వరూపం ప్రదర్శించాడు. అది మహాగ్ని సాక్షాత్కారమే, విశ్వం అగ్నిమయం గనుక.

దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా।
యది భాస్సదృశీ సాస్యాద్భాస స్తస్య మహాత్మనః॥

ఒక్కసారిగా వేలకొలదిగా సూర్యులు ఉదయించినట్లు మహాప్రకాశంతో కనబడ్డాడు శ్రీకృష్ణపరమాత్మ. మరి అతడే చిదగ్ని స్వరూపుడు కదా.

యథాః ప్రదీప్తం జ్వలనం పతంగా।
విశంతి నాశాయ సమృద్ధ వేగాః।
తథైవ నాశాయ విశంతిలోకాః
తవాపి వక్త్రాణి సమృద్ధ వేగాః॥

మిడుతలు వేగంగా అగ్నిలోకి ప్రవేశించి నాశనమౌతున్నట్లే లోకాలన్నీ ఆయన ముఖంలోకి తమ నాశనార్థమై ప్రవేశిస్తున్నాయి. ఇది ఆ అగ్నిముఖుని స్తవంలోని వాక్యాలు. ఆ విశ్వరూపుడే లయకారుడు. కాలస్వరూపుడు. "కాలోస్మి లోక క్షయకృత్" అని చెప్పాడా స్వామి. ఆ లయకారకత్వాన్ని తెలియజేసేవే ఈ వాక్యాలు.

విశ్వము భోగ్యం. భోక్త అగ్ని.

పరదేవతను "వహ్నిమండల శరీరిణి" అని ఆదిశంకరులు, నవరత్నమాలికాస్తోత్రంలో వినుతించారు.

'జ్వాలా మాలినికాక్షిప్త వహ్ని ప్రాకార మధ్యగా' అగ్ని ప్రాకార మధ్యంలో నివాసించే ఆ తల్లిని, 'వహ్నిమండల వాసినీ' అని లలితా సహస్రం పేర్కొంటోంది.

అదేవిధంగా లక్ష్మీ సహ, సం-'వహ్నిమండల సంస్థితా' అని లక్ష్మీ నామాన్ని పేర్కొంది. లక్ష్మీనామాల్లో-'ఆగ్నేయీ' 'దేహ హృద్దీపికా' 'దీప్తిః'- మొదలైన నామాలు పరాశక్తి జ్యోతిర్మయ రూపిణి అని తెలియజేస్తున్నాయి.

"వైశ్వానరీ-హవ్యవాహా-జాతవేద స్వరూపిణీ" అని 'కాళీ సహస్రం' అగ్ని శబ్దాన్ని స్త్రీవాచకంగా పేర్కొంది. ఆ కాళీదేవే వైశ్వానరరూపిణి. హవ్యవాహారూపిణి. జాతవేద స్వరూపిణీ—అంటే ఆ శక్తే 'అగ్నిరూపిణి' అని.

ఇక శివ సహస్ర లో-'తేజః', 'తేజస్కరః', 'బహురశ్మిః', 'సువర్చసీ', 'అగ్ని జ్వాలః' 'మహాజ్వాలః' 'అతి

ధూమ్రో', 'ధూమకేతనః', 'అనలః' అని శివ నామాలు చెప్పబడ్డాయి.

విష్ణు సహస్రంలో-'తేజః', 'ద్యుతిధరః', 'ప్రకాశాత్మా' 'హవిః', యజ్ఞ ఇజ్యోమహేజ్యశ్చ క్రతుస్సత్రం సతాంగతిః, అర్చిష్మాన్, ధనంజయః, అనలః, సహస్రార్చిః, సప్తజిహ్వః, జ్యోతిః, హుతభుక్, యజ్ఞోయజ్ఞపతిర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞ వాహనః, యజ్ఞ భృద్యజ్ఞకృద్యజ్ఞీ యజ్ఞభుగ్యజ్ఞసాధనః, యజ్ఞాంత కృద్యజ్ఞగుహ్యం-అని యజ్ఞమూర్తిగా, అగ్ని మూర్తిగా విష్ణునామాలు చెప్పబడ్డాయి.

## అగ్ని లోకం

అగ్ని దేవుని (సగుణ సాకార అగ్నిమూర్తి) లోకం గురించి శివపురాణం వివరించింది.

సనాతనమైన అగ్ని శివరూపమే. ఆ శివుడే 'గృహ పతి' అనే పేరుతో, 'విశ్వానరుడు' అనే మహర్షికి కుమారుడుగా జన్మించాడు. విశ్వానరుని తనయుడు కనుక 'వైశ్వానరుడు' అని పిలువబడ్డాడు.

విశ్వానరుని భార్య 'శుచిష్మతి' తన భర్తను తమకు "శివునివంటి కుమారుడు కావాల"ని కోరుకుంది.ఇది ఈశ్వర సంకల్పం. శివుని వంటివాడు ఎవరూ లేరు. శివుని వంటివాడు శివుడే. అతడు అద్వితీయుడు.

ఆ కారణంచేత, శివుని ప్రసన్నుని చేసుకొనేందుకు విశ్వానరుడు కాశీక్షేత్రంలో విశ్వనాథుడైన శివుని ఉద్దేశించి మహా దివ్యదీక్షతో తపస్సు ఆచరించాడు. ఆ తపోఫలితంగా శివుడు బాలరూపుడై ప్రత్యక్షమై, అతడికి కుమారుడిగా జన్మిస్తానని వరమిచ్చాడు.

ఆ వరప్రకారం - శుచిష్మతి గర్భాన జన్మించాడు శంకరుడు. అతడి పేరు 'గృహపతి'. అతడు బాల్యంలోనే శివునికోసం తపస్సు చేశాడు. ఆ తపస్సుకి సంతోషించి, శివుడు అతడిని ఆగ్నేయ దిక్కుకి, అగ్నిలోకానికి అధిపతిని చేశాడు. అగ్నిలోకానికి పేరు 'చిత్రహోత్రపురి'. తదాది-'వైశ్వానరుడు' అని అగ్నికి పేరు. శివ స్వరూపుడైన వైశ్వానరుడు అగ్నిహోత్ర దేవత అయ్యాడు.

ఆ వైశ్వానరుడే ఆగ్నేయ దిక్పాలకుడు. ఆగ్నేయ దిక్కు- అగ్నిస్థానం కనుక, వాస్తుశాస్త్రరీత్యా ఇంట్లో వంట చేసే స్థానం ఆగ్నేయ దిక్కునే వుండాలి.

అగ్ని ఉపాసకులు, ఆ ఉపాసనాఫలంగా అగ్ని వర్చస్కులై దివ్యమైన అగ్నిలోకానికి చేరుకుంటారు. శీతాకాలంలో ప్రజల చలిబాధ పోగొట్టేందుకు అగ్నిని ప్రజ్వలింపజేసి, శీతబాధ నివారింపజేస్తే ఆ పుణ్యఫలంగా అగ్నిలోకాన్ని చేరుకుంటారు. అనాథప్రేతాలకు అగ్ని సంస్కారం చేసినా, చేయించినా అగ్నిలోకం పొందుతారు.

సర్వతీర్థాలు, సకల వ్రతాలు, గురుదేవతలు అగ్ని లోనే వుంటారు గనుక అగ్నిని సేవిస్తే సకల దేవతలను సేవించిన ఫలం సంభవిస్తుంది.

అపవిత్ర వస్తువులన్నీ వహ్ని సంస్పర్శచేత పవిత్రాలవుతాయి. అన్నిటినీ పవిత్రం చేస్తాడు కనుక 'అగ్ని'కి 'పావకుడు' అని పేరు. శివపురాణంలోని శతరుద్రసంహితలో ఈ కథ వివరించబడింది.

తొందరగా పాపములను శోషింపజేసేవాడు కనుక 'ఆశుశుక్షణి'. సకల జీవాధారుడు కనుక 'అనలుడు'.

శివతేజమే అగ్ని. సప్తజిహ్వుడైన అగ్ని స్వాహాశక్తితో శివుని త్రినేత్రమై కూడా వున్నాడు. ప్రపంచంలో అగ్ని లేనిదే ఏదీ ప్రకాశించదు.

జ్వాలకే 'అర్చి' అని పేరు. 'దేవతల్ని అగ్నిహోత్రమందు అర్పించాలి. లేదా ప్రతీకయందు అర్చించాలి' అని శ్రీరాముడు లక్ష్మణునకు వివరించాడు.

## అగ్ని వంశం

మహాభారతంలో 'అగ్ని వంశం' గురించి మార్కండేయుడు ధర్మరాజునకు వివరించాడు.

ప్రథమాగ్ని జగద్వంద్యుడు. తరువాతి అగ్ని ప్రాజాపత్యవహ్ని. అతడే 'అంగిరసుడు'. అతడు అగ్నికి అగ్ర తన

యుడు. (అంగములయందు-అవయవములందు-నిహితమై వుంటాడు గనుక 'అంగిరసుడు' అని పేరు)

ఆ అంగిరసునకు 'శివ' అనే దివ్యస్త్రీకి-1.బృహత్కీర్తి, 2. బృహజ్జ్యోతి, 3. బృహద్బ్రహ్మ, 4. బృహన్మనసుడు, 5. బృహన్మంత్రుడు, 6. బృహద్భానుడు, 7. బృహస్పతి-అని ఏడుగురు కొడుకులు; 1. భానుమతి, 2. రాకా, 3 సినీవాలీ, 4. గుహూవు, 5. అర్చిష్మతి, 6. మహిష్మతి, 7. మహామతి-అని ఏడుగురు కుమార్తెలు కలిగారు.

అందులో బృహస్పతికి 'శంయుడు' అనే అగ్ని పుట్టాడు. అతడు యాగాలలో ముందుగా హవిషాజ్యాన్ని స్వీకరించే దైవం.

ఆ శంయుని ధర్మపత్ని 'సత్య'కు-1. భరద్వాజుడు, 2. భరతుడు అనే ఇద్దరు కుమారులు కలిగారు.

భరతునకు 'భారతు'డనే కుమారుడు, 'భారతి' అనే కుమార్తె పుట్టారు.

భరద్వాజునకు 'వీర' అనే ధర్మపత్నియందు 'వీరుడు' అనే అగ్ని జన్మించాడు.

ఆ వీరునికి, సరయువు అనే స్త్రీకి 'భానుడు' కుమారుడు. అతడి కుమారుడు 'నిశ్చ్యవనుడు'.

నిశ్చ్యవనుని కుమారుడు 'నిష్కృతి'. ఆ అగ్ని పేరు వింటే చాలు పాపాత్ముల పాపాలు దగ్ధమవుతాయి, గనుక ఆ నామం సార్థకం.

ఆ నిష్కృతి అనే అగ్ని కుమారుడు 'రుజస్కరుడు'. అతడి కొడుకు 'క్రోధుడు'.

క్రోధుని కుమారుడు 'రసుడు'. రసునకు, స్వాహాకు పుట్టినవాడు 'కాముడు'. కాముని కొడుకు 'అమోఘుడు'. అతడి కుమారుడు 'ఉక్థుడు'.

ఇక-కాశ్యపుడు, వసిష్ఠుడు, ప్రాణుడు, అంగిరసుడు, చ్యవనుడు- అనేఅయిదుగురు మహర్షులు తేజస్విఅయిన కుమారుని పొందేందుకు మహాతపస్సు చేశారు. అప్పుడు-మహాతేజస్వరూపుడైన అగ్నిమూర్తి ఆవిర్భవించాడు. అయిదుగురు (పంచజనులు) మహర్షుల తపస్సుచేత ప్రభవించినందుకు ఆ అగ్నిమూర్తి 'పాంచజన్యుడు' అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు.

ఆ పాంచజన్యుడు పదివేల సంవత్సరాలు తపస్సుచేసి, తన మస్తకంలో బృహద్రథంతరులనే వారిని, వదనంలో హరిని, నాభియందు శివుని, బలంలో ఇంద్రుని, ప్రాణాలలో వాయ్వగ్నులను, బాహుయుగాలలో, దంతపుటాలలో విశ్వభూతాలను సృష్టించాడు. అంటే అగ్ని సర్వదేవమయుడై, సర్వ విశ్వమయుడై ప్రకాశించాడని అర్థం.

'తపుడు' అనే వహ్ని పదిహేనుమంది కుమారులను పొందాడు. ఆ కుమారులలో-1. సుభీముడు, 2. అతిభీముడు, 3. భీముడు, 4. భీమబలుడు, 5. అతిబలుడు-అనే అయిదుగురు ఒకవైపు,

1. సుమిత్రుడు, 2. మిత్రవంతుడు, 3. మిత్రజ్ఞుడు, 4. మిత్రవర్ధనుడు, 5. మిత్రధర్మ-అనే అయిదుగురు మరో వైపు-

1. సురప్రవీరుడు, 2. వీరుడు, 3. సువేషుడు, 4. సువర్చసుడు. 5 సురహంత-అనే అయిదుగురు ఇంకో వైపు-

...ఇలా మూడు ముత్తాలై యజమానుల యజ్ఞ ఫలాలను అపహరిస్తుంటారు. వారి శాంతికై యాగాలలో అగ్నిచయనం చేస్తారు. తద్వారా వారు యజ్ఞ భూమికి చేరరు.

'తపుడు'- ఈ పదిహేనుమంది నే కాక, యజ్ఞ భాగభుజులైన అయిదుగురు కుమారులను పొందాడు. వారు: 1. వైశ్వానరుడు, 2. విశ్వపతి, 3. విశ్వకుడు, 4. విశ్వభుక్కు, 5. గోపతి.

వైశ్వానరుడు చాతుర్మాస్య విధుల్లో ద్విజులచేత పర్జన్య సహితుడై అర్చింపబడుతుంటాడు. 'విశ్వపతి' సకల విశ్వాన్నీ పాలించే అగ్ని. 'విశ్వకుడు'-విశ్వానికి ఆత్మడై ప్రకాశించే అగ్ని. 'విశ్వభుక్కు' సమస్త ప్రాణకోటి ఆహారాన్నీ పక్వం చేసే అగ్ని. 'గోపతి' సమస్త ధర్మక్రియలకు హేతువైన అగ్ని.

ఇక-సోముని కుమార్తె అయిన 'బృహద్భాస'యందు, భానుడనే అగ్నికి-1. బలదుడు, 2. మన్యుమంతుడు, 3. ధృతి

మంతుడు, 4. నాగ్రయణుడు, 5. అగ్ని, 6. సోముడు-అనే ఆరుగురు కుమారులు, 'నిశ' అనే కుమార్తె కలిగారు.

సకల తపః కర్మలు నిర్వహించేందుకు ఇంద్రుడు 'మను' అనే కుమారుడ్ని పొందాడు. ఆ మనువు, భాను పుత్రి అయిన 'నిశ'ను పెళ్ళాడి 'ప్రాజాపత్యుడు' అనే పేరున అర్చింపబడుతున్నాడు.

ఈ విధంగా అనేక వహ్నులు, సకల ధర్మక్రియా సాధకులైన వివిధాగ్నులుగా వెలిగారు.

'అపుడు' అనే అగ్ని 'ముదిత' అనే తరుణియందు 'అద్భుత' అనే అగ్నిని పొందాడు. అతడు ధరాతలంలో ప్రవేశించాడు. అతడి శరీరావయవాలనుండి-గంధకం, దేవ దారువు, స్ఫటికం, మరకతం, నీలం, అభ్రకం, ప్రవాళం (పగడం)-వంటివి పుట్టాయి.

ఇక్కడ 'అగ్ని కుమారులు'-అంటే- అగ్ని వేరు, అతడి కుమారులు వేరు అనికాదు. దీపం నుండి దీపం వెలిగి నట్లుగా, అగ్ని అనేకాగ్నులుగా ఆవిర్భవించాడు. వివిధ లోకాలలో వివిధ కార్యాల నిమిత్తమే ఆ ఆవిర్భావం. ఈ అగ్ని వంశాన్ని చెప్పి, "అగ్నులు ఎందరైనప్పటికీ తదాత్మ అయిన తేజం ఒక్కటే"నని మహాభారతం వచించింది. కనుక అగ్ని కుమారులందరూ ఒకే అగ్నిస్వరూపులు.. అతడి విభిన్న రూపములు, విభిన్న నామములు వంశాలుగా వర్ణించ బడ్డాయి. వాటిని మననంచేసి నమస్కరిస్తే చాలు పునీతుల మవుతాం.

ఆ తేజ స్వరూపుడైన అగ్ని శివతేజాన్ని భరించి కుమార జననానికి కారకుడయ్యాడు. అందుకే కుమార స్వామిని 'అగ్నిజన్ముడు,, 'ఆగ్నేయుడు' మొదలైన పేర్లతో పిలుస్తారు.

## రామాయణంలో....

'సీతాయాశ్చరితం మహత్' అయిన 'రామాయణంలో' సీతాదేవి పాతివ్రత్య జ్వాలారూపిణి. ఆమే ఓ అగ్ని. పాతివ్రత్యాగ్ని. ఆ అగ్నిని ఇంధనాగ్ని ఏం చేయలేదు. ఆ మహిమ చేతనే-హనుమంతుని తోకకు నిప్పుపెట్టారని తెలియగానే, ఆమె అగ్నిని నమస్కరించింది.

'యద్యస్తిపతి శుశ్రూషా
యద్యస్తి చరితం తపః।
యది వాత్యేక పత్నీ త్వాం
శీతో భవ హనూమతః॥

అని అందామె. 'నేను పతిసేవా పరాయణురాలనైతే, నా చరిత్ర తపస్సుతో కూడినదైతే, రామునికి నేను ఏక పత్నినే అయితే హనుమంతునకు నీవు చల్లనివాడవవ్వాలి' అనే సీతావచనం అమోఘమైనది.

రావణుని అధర్మానికి ఫలితంగా, ఆంజనేయ వాలాగ్ని శిక్షాగ్నిగా లంకను దహించింది.

అగ్నిజ్వాలతో వున్న హనుమంతుడు-సూర్యునిలా, యుగాంత కాలాగ్నిలా ప్రకాశిస్తున్నాడు.

ప్రదీప్తలాంగూల కృతార్చిమాలీ
ప్రకాశితాదిత్య ఇవార్చి మాలీ
...యుగాంతకాలానల తుల్యరూపః
ఆదిత్యకోటీ సదృశః సుతేజా॥-అని వాల్మీకి రామాయణంలో వర్ణితం.

మాటమాత్రం చేత అగ్నిని చల్లబరచిన 'పాతివ్రత్య జ్వాలారూపిణి' సీత అగ్నిప్రవేశం చేసింది—యుద్ధానంతరం.

త్రికరణాలతోనూ రామునే తప్ప అన్యాన్ని ఎరుగని ఆ తల్లి యొక్క- జ్వాలని తట్టుకోలేకపోయాడు ఇంధనాగ్ని. ఆమె అనింధాగ్ని. అతడు ఇంధనాగ్ని. అందుకే వెంటనే సీతను తీసుకువచ్చి, శ్రీరామచంద్ర ప్రభువునకు అప్పగించి, "ఈ అగ్ని నన్ను కాల్చుతుంది" అన్నాడు అగ్ని.

కనుక సీత అగ్ని. పాతివ్రత్యాది మహాగుణాలు అగ్ని స్వరూపాలే. వాటిని పంచభూతాలు ఏమీ చేయలేవు పంచభూతాలు ధర్మానికి అనుగుణంగా వుండి, ప్రసన్నమై కరుణిస్తాయి.

శ్రీరామచంద్రమూర్తి సాక్షాన్నారాయణుడే గనుక ఆయన పరమాగ్ని స్వరూపుడే. పైగా యజ్ఞ సంభవుడు. పుత్రకామేష్టి ఫలంగా లభించిన శ్రీమహావిష్ణువు. యజ్ఞ రక్షకుడు.

'అగ్ని సాక్షి'త్వానికి సనాతనంగా గొప్ప ప్రశస్తి వుంది. అగ్ని సాక్షిగా స్నేహం చేయడం వివిధ సందర్భాలలో వర్ణించబడింది. శ్రీరాముడు అగ్నిసాక్షిగా సుగ్రీవునితో మైత్రిని స్వీకరించాడు. అగ్నిసాక్షి సర్వదేవతల సాక్షి.

వివాహాదులు అగ్నిసాక్షిగా జరగడమేకాక, అగ్ని కర్మతోనే వివాహం శుభకర్మఅనిపించుకుంటుంది. ఉపనయన, వివాహాది కర్మలు అగ్ని ఆరాధనతో కూడుకున్నవి. ఆ హవ్యవాహనుని ఆరాధించే ఆ దీక్షలు చేపడతారు. అగ్నిని ప్రదక్షిణచేసి, ఆ సర్వదేవతాత్మకుని అనుగ్రహం పొందడం ఆ శుభకర్మలలో ప్రధానాంశం.

# అగ్ని మనకు తండ్రి

జగత్తుని పోషించి, రక్షించి, పాలించేవాడు-అని 'పితృ' (తండ్రి) శబ్దానికి అర్థం. కనుక అగ్ని 'పిత'.

ఈ కారణం చేతనే-

సనః పితేవ సూనవేగ్నే
సూపాయ నో భవ
స చ స్వానః స్వస్తయే॥ (అగ్నిసూక్తం).

"ఓ అగ్నీ! కుమారునకు తండ్రివలె, నువ్వు మమ్ము సమీపించు, మాకు శుభము కలిగించు" అని అగ్నిసూక్తం.

అగ్ని నుండి వేదాలు జనించాయి. వేదాల ద్వారా అగ్ని గోచరుడౌతాడు. కనుకనే ఆయనను 'జాతవేదుడు' అన్నారు. అతడు హవ్యాలను మోసి దేవతలకందజేస్తాడు కనుక 'హవ్యవాహనుడు'. హుతమైనవే అశనం (ఆహారం)గా స్వీకరిస్తాడు కనుక 'హుతాశనుడు'.

## భరతుడు-భారతదేశం

అగ్నే 'భరతుడు' అనే పేరుతో పిలవబడుతున్నాడు.

భరతః—భరణం కుర్వతః తేన భరత శబ్దస్య నిర్వచనమ్॥

భరించువాడు భరతుడు.

భరత్యేష ప్రజాః సర్వాస్తతో భరత ఉచ్యతే॥

తుష్టిని, పుష్టిని కలిగించేవాడు, తద్వారా సర్వప్రాణి కోటినీ భరించువాడు కనుక అగ్నిని 'భరతుడు' అన్నారు.

హవిర్భరణ, ప్రజాభరణాది ధర్మాలను బోధించేది 'భరత' శబ్దం. జడములై, అచేతనములైన భూతాలను చైతన్యవంతంగా దీపింపజేస్తూ, భరించువాడు కనుక 'అగ్ని'కి భరతుడని పేరు.

మన దేశం భారతదేశం. అంటే 'భరత' సంబంధమైన దేశం. అనాదిగా ఇది యజ్ఞభూమి. యజ్ఞం అగ్ని దేవతాత్మకమైనది. అగ్నినే సర్వదేవతా స్వరూపంగా అర్చించారిక్కడ. యజ్ఞాది కర్మలతో పునీతమైన దేశమిది.

అగ్నే 'భరతుడు' కనుక, సర్వం ఆ భరతునిచేత భరించబడుతోందనే జ్ఞానంతో, ఆ భరతుని ఆరాధనతో, అర్చనలతో, యజ్ఞాలతో ఉపాసించిన ఋషులు ఈ పుణ్య ఖండాన్ని 'భరతఖండం', 'భరతవర్షం' అని పిల్చారనవచ్చు. 'అగ్నిగర్భ'గా కూడా ఈ పృథ్విని వినుతించారు. 'కర్మ భూమి' అన్న పేరే 'భరత' (అగ్ని) ప్రాధాన్యాన్ని తెలియ జేస్తోంది.

మన దేశం సనాతనంగా అగ్ని ఆరాధనతో ధన్య మైంది. తదనంతరం ప్రపంచంలో అన్ని ప్రాంతాల్లో, అన్ని తెగల్లో, మతాల్లో వివిధ పద్ధతుల్లో అగ్ని ఆరాధన నిలిచింది.

అగ్నిని (ప్రకాశ, దాహక, పావకరూపుని) కాదని ఏ జీవీ వుండలేదు. తెలిసినా, తెలియకున్నా అగ్నే మనల్ని నడుపుతున్నాడు. మనయందున్నాడు. విశ్వమంతా వున్నాడు.

## వహ్ని

వహాన్, నయతీతి-వహ్నిః. హవిర్భాగాదులను దేవత లకై మోసుకొనిపోయి చేర్చువాడు. ప్రాణుల దేహాలను ఆశ్రయించి, సమర్పించిన ఆహారాన్ని వహిస్తూ, సకలేంద్రి యాణి దేవతలకు పంచియిచ్చి జీవపోషకుడగుటచే 'వహ్ని'.

## ధనంజయుడు

ధనం జయతీతి-ధనంజయః. సంపదలను జయించిన వాడని అర్థం. సకలైశ్వర్యప్రదుడై, యుపాసకులగు నరులకు ధనంజయత్వాన్ని ప్రసాదించువాడని అర్థం. కాబట్టి ఖాండవ వనదహన సహాయ సంతుష్టుడై నరునకు (అర్జునునకు) ధనం జయత్వాన్ని ప్రసాదించాడు.

## వీరుడు

అగ్ని వీరస్వరూపుడు. కనుకనే 'వీర' అన్నారు. పరాక్రమం, వీరత్వం అగ్నిస్వరూపాలే.

"హే వీర! విశ్వతే! అగ్నే"-అని వేదం స్తోత్రించింది.

'విశ్వపతి అయిన పరమేశ్వరా! అగ్నీ! వీరా!' అని స్తుతి.

## పురోహితుడు

'అగ్ని మీళే పురోహితమ్'—అని ఋక్కు.

ముందుగా హితాన్ని కోరేవాడు- పురస్తాత్ హితః- కనుక 'పురోహితుడు' అని అగ్నిని పేర్కొన్నారు.

పురము-అనగా శరీరం. 'నవద్వారే పురేదేహీ' అనే భగవద్గీత వాక్యమే ఇందుకు ప్రమాణం. ఈ శరీరానికి

శక్తిని, ఉనికిని, చైతన్యాన్ని ప్రసాదించి, హితం చేకూర్చు తాడు కనుక అగ్నిని 'పురోహితుడు' అన్నారు. ఊరుకి (పురానికి) ఇహపరాల హితం కోరేవాడు పురోహితుడు.

## ఋషి

'అగ్నిర్ ఋషిః పవమానః పాంచజన్యః పురోహితః - అని ఋగ్వేదం.

వేదానుగుణంగా, అతీంద్రియ సృష్టికార్య నిర్వహణ విధులను దర్శించడంచేత అగ్నిని 'ఋషి' అన్నారు.

హస్తే దధానో నృమ్ణా విశ్వాన్యమే దేవాన్ధాత్
గుహా నిషీదన్। విదన్తీ మత్ర నరో ధియంధా
హృదా యత్ తష్టా మంత్రాగ్ం అశం సన్॥

(ఋగ్వేదం)

"అగ్ని హావిస్సులతో కూడా అంతర్హితుడు కాగా, దేవతలు హృదయం నుండి ఉద్గమించే సుసంస్కృతాలైన మంత్రాలతో అగ్నిని స్తుతించి, గుహాయందు అంతర్నిహితుడై వున్న అగ్నిని సాక్షాత్కరించుకున్నార"ని ఋగ్వేదం చెప్తోంది.

ఋషిర్దర్శనాత్-సర్వద్రష్టృత్వం, లేక క్రాంత దర్శనం గల పరమాత్మ కనుక 'అగ్ని'ని 'ఋషి' అన్నారు.

## అగ్న్యద్వైతం

సర్వే సర్వత్రా, స్వప్రకాశ చైతన్యమయ సత్యానంద స్వరూపియగు 'అగ్ని'ని దర్శించే స్థితి జీవితలక్ష్యం. 'అహం బ్రహ్మాస్మి' భావనలో, 'నేను అగ్ని'ని అనే అద్వైతబోధ లభిస్తుంది.

'అగ్నియే సర్వం'-అనే భావనని వేదాలు ప్రవచించాయి. ఆ విధంగా వేదప్రోక్తమైన 'అగ్న్యద్వైతం' మహాత్ముల మతమయ్యింది.

'అగ్ని రస్మి జన్మనా జాతవేదా ఘృతం మేచక్షు
రమృతం మ ఆసన్...' అనే ఋక్కు ప్రకారం, 'నేను జన్మతః (స్వతస్సిద్ధముగా) జాతవేదుడైన అగ్నిని'-అని 'అగ్న్యద్వైతం' చెప్తోంది.

ఈ సత్యాన్ని ఆవిష్కరించుకోవాలంటే చిత్తశుద్ధి అవసరం. స్వధర్మ విహితమైనసత్కర్మాచరణ చిత్తశుద్ధి నిస్తుంది. ఆ ధర్మం అగ్న్యారాధనమయమన్నది సుస్పష్ట మయ్యింది.

# భక్త రక్షకుడు

అగ్నిని ఉపాసించే భక్తుని, నిరంతరం ఆ అగ్ని కంటికి రెప్పలా కాపాడతాడు. దానికి తార్కాణమే ప్రవరుని గాథ. మార్కండేయ పురాణంలోని ఈ గాథ 'మనుచరిత్ర'లో పెద్దన గారిచే హృద్యమైన పద్యరచనగా జాలువారింది.

ప్రవరుడు మహాధర్మశీలి. అనారతాధ్యాపనపరుడు. సదాచారపరాయణుడు. అత్యాగ్నిహోత్రకర్మ చేసే మహాత్ముడు. ఆ మహాత్ముడు ఒక యోగిపుంగవుడిచ్చిన లేపన మహిమచే హిమాద్రికి చేరి, అక్కడి దివ్యతీర్థాలు దర్శించి, లేపనం కరగడంచేత ఆ పవిత్రగిరిలో దారి తెలియక చిక్కుపడతాడు.

తన నిత్య నైమిత్తిక కర్మలకు ఆటంకం కలిగినందుకు బాధపడతాడా ఉత్తముడు. ఆ సమయంలో వరూధిని ఆయనను కామించి, మోహింపజేయాలని ప్రయత్నించడం, ఆ ధర్మశీలి ఆమెను తిరస్కరించడం మనకు తెలిసినదే.

ఆ తరువాత అతడు తాను ఉపాసించే గార్హపత్యాగ్నిని స్తుతిస్తాడు. ఆ అగ్ని కృపవల్ల అతడు తిరిగి తన స్వస్థలానికి చేరుకుంటాడు.

ఆయన చేసిన అగ్నిస్తుతి:

దివిషద్వర్గము నీ ముఖంబునన తృప్తింగాంచు సిన్నీశుగా

స్తవముల్ సేయు శ్రుతుల్ సమస్తజగదంతర్యామి
విన్నీవ యా-
హవనీయంబును దక్షిణాగ్నియును నీయందుద్భవించుం
గ్రతూ-
త్సవ సంధాయక! నన్ను గావ గదవే స్వాహావధూ
వల్లభా!

"ఓ స్వాహా పతీ! యజ్ఞోత్సవాన్ని చేకూర్చే వహ్నిదేవా! నీవనే ముఖం చేతనే దేవతలు తృప్తి చెందుతారు. సమస్త జగత్తుకి అంతర్యామివైన నీనుండే ఆహవనీయాగ్ని, దక్షిణాగ్ని ఉద్భవిస్తున్నాయి."

- ఈ విధంగా స్తుతించిన ప్రవరుడు,

దాన జపాగ్నిహోత్ర పరతంత్రుడ నేని భవత్పదాంబుజ
ధ్యాన రతుండ నేని బరదారధనాదుల గోర నేని స-
న్మానముతోడ నన్ను సదనంబున నిల్పుమినుండు
పశ్చిమాం
భోనిధిలోన గ్రుంకకయమున్న రయంబున హవ్య
వాహనా!

"ఓ హవ్యవాహనా! నేను దాన జపాగ్నిహోత్ర పరతంత్రుడనై, నిరంతరం నీ పద పద్మాలనే ధ్యానిస్తూ, పరస్త్రీ పరధనాలను వాంఛించనివాడనై తే-నన్ను దయతో సూర్యాస్తమయం లోపలే స్వగృహాన్ని చేర్చుమ"ని ప్రార్థిం

చాడు. అతడి ప్రార్థనని మన్నించి ఇంటచేర్చాడు అగ్ని భగవానుడు.

# అగ్నీ షోమాత్మకం జగత్

ఈ జగత్తు అంతా అగ్నీ షోమాత్మకం. 'సోమ'అంటే 'రసం'. ఈ విశ్వంలో సూక్ష్మ సూక్ష్మభూతాలలో వున్నవి-తేజము (అగ్ని), రసము.

తేజస్సు-సూర్యరూపం, అగ్నిరూపం.

రసం-సోమరూపిణి, జలరూపిణి.

తేజస్సు విద్యుత్తుగా, కాంతిగా, ఉష్ణంగా లభిస్తుంది. రసం-నీరుగా, తేనె, నెయ్యి మొదలైన యజ్ఞద్రవ్యాలుగా లభిస్తుంది. మనం భుజించే ఆహారం అగ్నీ షోమాత్మకమే

అగ్ని-తేజఃస్వరూపం. సోమం-అమృతస్వరూపం.

అమృతమయ తేజస్వరూపుడు పరమేశ్వరుడు.

అగ్ని వల్లనే అమృతోత్పత్తి జరుగుతుంది. అమృతం వల్ల అగ్ని ఉత్పత్తి అవుతుంది. అమృత స్వరూపమైన ఘృతం సోమమే. ఆ ఘృతానికి కారకుడూ అగ్నే.

సోమం శక్తి. అగ్ని శక్తిమయమైన తేజం. అగ్నికి

పీఠం శక్తి. శక్తికి పీఠం అగ్ని. శక్తి ఆధారంగా అగ్ని ప్రజ్వరిల్లుతుంది.

సస్య సంపత్తి హవిస్సుల్ని ఉత్పత్తి చేస్తుంది. ఆ హవిస్సులు అగ్నిని ప్రజ్వరిల్ల జేస్తాయి. వర్షం (సోమం) సస్యాలను ఉత్పత్తి చేస్తుంది. వర్షం సూర్యాగ్ని వల్ల సంభవిస్తుంది. సూర్య తేజస్సు (అగ్ని) వల్ల భూగతజలం (సోమం) ఆవిరై మేఘాలు ఏర్పడి, వర్షం కురుస్తుంది.

ఆ కురిసిన వర్షంవల్ల, భూగతమైన అగ్ని (ఉష్ణత) కారణంగా బీజాలు అంకురించి సస్యాలవుతాయి. ఆ సస్యాలు అగ్ని, రసాల ద్వారా పచనమై జీవులకు ఆహారమౌతాయి. ఆ ఆహారం శరీరగతమైన అగ్ని ద్వారా జీర్ణమై, శక్తి అవుతుంది. ఇలా పరిశీలిస్తే జగత్తు అంతా అగ్నీసోమాత్మకమే.

యోగి-యోగమయ శివాగ్నితో శరీర బంధనాలను దహించి, యోగ మార్గంలో సోమామృతస్నాతుడై అమృతస్వరూపుడౌతాడు.

ఘృతాక్తవర్తి (నేతితో తడిసిన వత్తి) జ్యోతిగా వెలుగుతుంది. కనుక ఆ జ్యోతి అగ్నీ సోమాత్మకమే.

యజ్ఞంలో జరిగే ప్రక్రియ-దేవతల్ని ఉద్దేశించిన ఆహుతుల్ని అగ్నిలో వేయడం. ఆహుతులు అగ్నివల్లనే ఉత్పత్తి అవుతాయి. అగ్ని ఆహుతులవల్ల ప్రజ్వరిల్లుతుంది.

విశ్వమంతా అగ్నీ సోమాత్మకం కనుక 'విశ్వం యజ్ఞమయం' అన్నది సుస్పష్టం. నిరంతరం విశ్వంలో జరిగే ఈ యజ్ఞమే సృష్టి స్థితి లయ రూపం.

సూర్య, జల-అనగా అగ్నీ సోమ-తత్త్వం వల్లనే పగలు, రాత్రి, వర్షం, కాంతి, దినాలు, మాసాలు, ఋతువులు, అయనాలు, సంవత్సరాలు ఏర్పడుతున్నాయి. ఈ సంవత్సర చక్రం యజ్ఞమే. ఇదే కాలం. కనుక కాలం కూడా అగ్నీ సోమాత్మకమే. యజ్ఞమే. సమస్తమూ కాలాగ్నిలో హుతమయ్యేదే.

అగ్నిలో సోమం విడదీయలేనిది. సోమంలో అగ్ని విడదీయలేనిది.

అగ్ని సారం-భస్మం. అది అగ్నిమయం గనుక ఐశ్వర్య కారకమై 'విభూతి' అనిపించుకుంటుంది. సోమతత్త్వమైన జలాన్ని, అగ్నితత్వమైన భస్మంతో కలిపి భస్మధారణ చేస్తారు. లలాటంపై, భుజాలపై, కంఠంపై, వక్షస్థలంపై, ఉదరంపై భగవన్నామాలతో, మంత్రాలతో భస్మధారణ చేయడం మన సంప్రదాయం. జలం కలిపిన భస్మాన్ని ధరించడమే శాస్త్రం. అగ్నీసోమతత్వాన్ని తెలియజేసేదీ భస్మధారణ. ఇది అమృతత్వదాయకం. మృత్యునివారకం. పాపపరిహారకం. కనుకనే భస్మధారణ సమయంలో మృత్యుంజయ మంత్రాన్ని జపిస్తారు.

అమృతమైన సోమమే పరాశక్తి. తేజోమయ అగ్నియే పరమాత్ముడు. ఆ సోమం ఉమా, ఆ అగ్ని శివుడు. ఉమా శివులే సోమాగ్నులు. వారే వాగర్థాలు. భస్మధారణ శివ శక్తుల ఐక్యాన్ని తెలియజేసేది.

ఉమా సమేతుడైన శివుని-అనగా సాంబశివుని (అంబతో వున్న శివుని) ఉపాసించాలని శివ పురాణం చెప్తోంది.

సోమాగ్నులు అవిభాజ్యులు. వేరు చేయలేనివారు. అనపాయులు. ఒకరి కొకరు ఆధారులు. తత్త్వతః చూస్తే ఇద్దరూ ఒక్కరే. ఇదే అర్ధనారీశ్వర తత్త్వం.

సోమాగ్నులే ఉమామహేశ్వరులు. ఆ సోమాగ్నులే లక్ష్మీనారాయణులు. వాణీ హిరణ్యగర్భులు. ప్రకృతీ పురుషులు. విశ్వకారణులు.

సమస్త స్త్రీ పురుషాత్మక జగత్తు వారి స్వరూపమే.

ఆ అమృతమయ తేజస్స్వరూపమే ఉపాస్యం. శరణ్యం.

నమశ్శివాయై చ నమశ్శివాయ

నమో శ్రీమన్నారాయణాయ